


# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com








హైదరాబాద్ | శనివారం 7-11-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:82 | పేజీలు:4 | వెల: రూ.1/-


# జో బైడెన్‌కు భద్రత పెంపు

## రంగంలోకి దిగిన అమెరికన్ సీక్రెట్ సర్వీసెస్

వాషింగ్టన్,నవంబర్6(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో లీడింగ్‌లో ఉన్న మాజీ ఉపాధ్యక్షుడు, డెమోక్రటిక్ అభ్యర్థి జోసెఫ్ బైడెన్‌కు భద్రతను పెంచనున్నారు. ఆ దేశానికి చెందిన సీక్రెట్ సర్వీస్.. బైడెన్ వద్దకు ప్రత్యేక అధికారులను పంపించనున్నది. డెమోక్రటిక్ నేతకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు సీక్రెట్ సర్వీస్ చెప్పింది. ప్రస్తుతం డెలావర్‌లోని విల్మింగ్టన్‌లో బైడెన్ ఉన్నారు. వైట్‌హౌజ్ రేసులో విక్టరీ సాధించినట్లు ఆయన ఇవాళ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. విల్మింగ్టన్ కన్వెన్షన్ సెంటర్ నుంచే బైడెన్ ప్రసంగించే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఆయనకు అక్కడ సీక్రెస్ సర్వీస్ రక్షణ కల్పించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కౌంటింగ్‌ను ఆపివేయాలంటూ జార్జియా, మిచిగన్‌లో కేసులు వేసిన ట్రంప్ బృందానికి ఎదురుదెబ్బ తగిలింది. ఆ కేసులను కోర్టులు కొట్టివేశాయి. కౌంటింగ్‌ను ఆపాలని ట్రంప్ మద్దతుదారులు, మెయిల్ ఇన్ ఓట్లు అన్నీ లెక్కింపు చేయాలని బైడెన్ మద్దతుదారులు నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. దేశంలోని అనేక నగరాల్లో ప్రదర్శనలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల కౌంటింగ్ సెంటర్ల వద్ద కూడా ధర్నా ప్రదర్శనలు చేపడుతున్నారు. ఫిలిడెల్ఫియాలోని ఓట్ కౌంటింగ్ సెంటర్‌పై దాడికి ప్రయత్నించిన ఓ కుట్రను పోలీసులు ఛేధించారు. జార్జియాలో పోరు హోరాహోరీగా మారడంతో.. అబ్సెంటీ ఓటర్లు తమ ఓట్లను వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని డెమోక్రటిక్ పార్టీ పిలుపునిచ్చింది.

## వరద సాయానికి ఖైతన్ 50లక్షల విరాళం

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): ఇటీవల సంభవించిన వరదలతో అతాలకుతలమైన హైదరాబాద్ ప్రజలను ఆదుకునేందుకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా రాడికో ఖైతాన్ లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ సౌత్ జోన్‌కు చెందిన వైస్ ప్రెసిడెంట్ బెంజిగర్ జీ పూవట్టిల్ బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాడికో ఖైతాన్ లిమిటెడ్ తరపున రూ. 50 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు. రాడికో ఖైతాన్ లిమిటెడ్ యాజమాన్యానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో అమెజాన్ భారీ పెట్టుబడులు

## రూ. 20,761 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అమెజాన్ వెబ్ ట్విట్టర్ ద్వారా వెల్లడించిన మంత్రి కెటిఆర్

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): తెలంగాణాలో రూ. 20,761 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రకటించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద పెట్టుబడని కెటిఆర్ పేర్కొన్నారు. పలు చర్చల తర్వాత ఏవీఎస్ తమ పెట్టుబడులకు ముందుకు వచ్చిందని ఆయన అన్నారు. 2022 మధ్య ద్వితీయార్థంలో అమేజాన్ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాదులో మూడు అవైలబిలిటీ జోన్లను ఏర్పాటు చేయనుంది. ప్రతి అవైలబిలిటీ జోన్‌లో అనేక డాటా సెంటర్ల ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వ పారదర్శక, వేగవంతమైన పరిపాలనా విధానాల వల్లే రాష్ట్ర భారీ పెట్టుబడులు వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్‌ను తన దావోస్ పర్యటనలో కలిసిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆకర్షణీయమైన పాలసీల ద్వారా తెలంగాణలోకి పెట్టుబడులు అనేకం వస్తున్నాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అమెజాన్ వెస్ సర్వీసెస్ పెట్టుబడులతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ పెట్టుబడికి సంబంధించి ప్రాథమిక చర్చలను దావోస్ పర్యటనలో ప్రారంభించినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా సుమారు రూ. 20 వేల 761 కోట్ల పెట్టుబడులు తెలంగాణ రాష్ట్రంలోకి రావడం కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థకు మంత్రి కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వం తరపున



హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రూపొందించిన టీఎస్ ఐపాస్‌తో పాటు దావోస్ పర్యటనలో అమెజాన్ సంస్థ ఉన్నతస్థాయి ప్రతినిధులతో ఇందుకు సంబంధించి చేసిన చర్చలను ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ద్వారా రాష్ట్రానికి వస్తున్న ఈ పెట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలోకి వస్తున్న అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ పెట్టుబడి తర్వాత అనేక కంపెనీలు తమ డాటా సెంటర్ల ఏర్పాటుకు తెలంగాణ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని, అలాంటి వారందరికీ తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. అమెజాన్ లాంటి ప్రఖ్యాత కంపెనీ తన భారీ పెట్టుబడికి తెలంగాణను ఎంచుకోవడం అంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పారదర్శక, వేగవంతమైన పరిపాలనకు నిదర్శనం అని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న అనేక ఆదర్శవంతమైన ప్రభుత్వ విధానాలు,పాలసీల ద్వారా ఐటీ, ఐటీ ఆధారిత రంగం పెద్ద ఎత్తున వృద్ధి చెందుతూ వస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ రోజు అమెజాన్ తన పెట్టుబడిని తెలంగాణలో పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వ విధానాల ద్వారా ఐటీ రంగంలో అనేక కంపెనీలు రావడంతో పాటు ఇన్నోవేటివ్ స్టార్టప్లకు, నైపుణ్యం కలిగిన మానవ వనరులకు కేంద్రం గా తెలంగాణ రాష్ట్రం మారిందన్నారు. ఈ పెట్టుబడి ద్వారా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి అమెజాన్ కి మధ్య ఉన్న బంధం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమెజాన్ తన అతిపెద్ద కార్యాలయానికి హైదరాబాద్ కేంద్రంగా ఎంచుకున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో బుడగ జంగాలు ముందుకెళ్లాలి : మంత్రి కొప్పుల




హైదరాబాద్ : అణగారిన వర్గాల ప్రజల్లో ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ భూమితో పాటు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించారని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నగరంలోని సైఫాబాద్‌లో శుక్రవారం ఆయన తెలంగాణ బేడ (బుడ )జంగం అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదన్నారు.

బేడ కులానికి చెందిన విద్యావంతులు బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ వర్గానికి చెందిన వారంతా వేర్వేరు సంఘాలుగా కాకుండా ఒకే సంఘంగా ఏర్పడి ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇంతకాలం సంచార జాతిగా ఉన్న బేడ కులస్తుల్లో ఇటీవల చైతన్యం పెరిగిందన్నారు. భవన నిర్మాణం కోసం భూమి, నిధులు కేటాయించడం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో బొక్కి జాతీయ ఉపాధ్యక్షుడు నర్రా రవికుమార్, అసోసియేషన్ ప్రముఖులు డాక్టర్ ఎన్.ఆర్.వెంకటేశం, ఎం.శివకుమార్, కె.శరత్చంద్ర, బాలనర్సింహం తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో కొనసాగుతున్న చెత్త తొలగింపు

### 15లక్షల లక్ష మెట్రిక్ టన్నుల చెత్త ఏరివేత: మేయర్

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): నగరంలో వరదల వల్ల ఏర్పడ్డచెత్తా చెదారం కార్యక్రమాన్ని తొలగించే కార్యక్రమాలు చురుకుగా సాగుతున్నాయి. 15 రోజుల్లో లక్ష మెట్రిక్ టన్నుల చెత్త, నిర్మాణ వ్యర్థాలను తొలగించామని నగర మేయర్ బొంతు రామ్మోహన్ గుర్తు చేశారు. మాసబ్‌ట్యాంక్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. వరదల కారణంగా నగరంలో చెత్త పెద్ద ఎత్తున పేరుకుపోయిందన్నారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. ఇంకా 30 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించాల్సి ఉందన్నారు. చెత్త, నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు 536 వాహనాలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. చెత్త తొలగింపు పనుల్లో వేలాది మంది కార్మికులు నిమగ్నమయ్యారు.

## దేశ రాజధానిలో బాణాసంచా నిషేధం

### కాల్చితే లక్ష వరకు జరిమానా: మంత్రి

న్యూఢిల్లీ,నవంబర్6(ఆర్ఎన్ఎ): పటాకులపై నిషేధం విధించిన ఢిల్లీ ప్రభుత్వం తాజాగా జరిమానాల గురించి కూడా వెల్లడించింది. దీపావళి పండుగ నేపథ్యంలో పటాకులు అమ్మినా లేక కాల్చినా రూ.లక్ష వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ శుక్రవారం ఈ విషయం తెలిపారు. పటాకులు అమ్ముతున్న లేదా కాల్చినట్టుగా కనిపించిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఆయన చెప్పారు. ఈ చట్టం కింద గరిష్ఠంగా రూ.లక్ష వరకు జరిమానా విధించవచ్చని మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. పటాకుల నిషేధంపై కార్యాచరణ సిద్ధం చేసేందుకు ఢిల్లీ కాలుష్య నియంత్రణ సంస్థ, పర్యావరణ శాఖ, ఢిల్లీ పోలీసులతో కలిసి సోమవారం సమావేశం నిర్వహిస్తామని ఆయన చెప్పారు. కాగా దేశ రాజధాని ఢిల్లీలో కరోనా మహమ్మారి మూడోసారి విజృంభిస్తున్నది. గత కొన్ని రోజులుగా ప్రతి రోజు సుమారు ఏడు వేల వరకు వైరస్ కేసులు నమోదవుతున్నాయి. అయితే వరుస పండుగలు, గాలి కాలుష్యం కరోనా వ్యాప్తికి కారణమని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. కరోనా వ్యాప్తి నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా పర్యావరణ హిత పటాకులపైనా నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 30 వరకు అన్ని పటాసులపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

# మంత్రి వేముల సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరికలు

నిజామాబాద్ , నవంబర్ 6: టీఆర్ఎస్‌లోకి వలసల వర్షం కొనసాగుతూనే ఉంది. తాజాగా జిల్లాలోని బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులుమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం టీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని తెలిపారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ..క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అలాగే టీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రతి కార్యకర్తకు భరోసా కల్పించే ఏకైక



పార్టీ టీఆర్ఎస్ అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి శుభాష్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు దాసరి వెంకటేష్, తౌట్ గంగాధర్, టీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేంపల్లి చిన్న బాల్ రాజేశ్వర్, టీఆర్ఎస్ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్,టౌన్ ప్రెసిడెంట్ సాగర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన బిజెపి కార్యకర్త శ్రీనివాస్ అంత్యక్రియలు

## భారీగా హాజరైన బిజెపి నేతలు పాడె మోసిన బండి సంజయ్

రంగారెడ్డి,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ కు నిరసనగా ప్రాణత్యాగం చేసిన కార్యకర్త శ్రీనివాస్ అంత్యక్రియలు ముగిశాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తుమ్మలోనిగూడంలో పోలీసులు భారీ బందోబస్తు మధ్య అంత్యక్రియలు జరిగాయి.

బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ అర్వింద్, మాజీఎంపీ వివేక్ వెంకటస్వామితో పాటు.. పార్టీ నేతలు అంత్యక్రియలకు హాజరయ్యారు. నల్ల బ్యాడ్జీలు ధరించి అంతమ యాత్రలో వీరంతా పాల్గొన్నారు. బండి సంజయ్ అరెస్ట్ ను నిరసిస్తూ నవంబర్ ఒకటిన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు బీజేపీ కార్యకర్త గంగుల శ్రీనివాస్. ముందు ఉస్మానియాలో చేరిన శ్రీనివాస్‌ను.. బండి సంజయ్ యశోద హాస్పిటల్ లో చేర్పించారు . దాదాపు 50 శాతం కాలిన గాయాలతో చికిత్సపొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. పోలీసు బందోబస్తు మధ్య శ్రీనివాస్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం తర్వాత డెడ్ బాడీని భారీ బందోబస్తు మధ్య సొంతూరు తుమ్మలోనిగూడెంకు అర్ధరాత్రి తీసుకెళ్లారు. శ్రీనివాస్ మరణం బాధించిందని బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ అన్నారు. బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే శ్రీనివాస్ కు అసలైన నివాళి అన్నారు. కార్యకర్త శ్రీనివాస్ పాడె మోసిన బండి సంజయ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మెరుగైన చికిత్స అందించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా శ్రీనివాస్ ను కాపాడుకోలేకపోయామన్నారు.

శ్రీనివాస్ మరణం హిందుత్వంపై దాడి అన్నారు ఎంపీ అర్వింద్. కార్యకర్తలెవరూ ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు మాజీఎంపీ వివేక్ వెంకటస్వామి. ధైర్యంగా ప్రభుత్వంపై పోరాడుదామన్నారు.

ఇక అంతకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్త శ్రీనివాస్ మరణం తనను ఎంతో బాధించిందన్నారు. మెరుగైన చికిత్స అందించాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా శ్రీనివాస్ ను కాపాడుకోలేకపోయామన్నారు. కార్యకర్తలెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు..

బ్రతికుండి పోరాటం చేయాలని సూచించారు. తెచ్చుకున్న తెలంగాణలో ఇదే ఆఖరి చావు కావాలన్నారు. అక్రమ అరెస్టులతో బిజెపి కార్యకర్తలను వేధించడం, రాజ్యాంగ హక్కులను హరించడంపై నిరసనలకు బిజెపి పిలుపునిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్, మండల కేంద్రాలలో జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సూచించింది. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా? భయపడకుండా ముందుకు సాగాలని కోరారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఆగక సాగెడి వ్యవసా
యోగము శాస్త్రము తెలిసిన యుష్టీ వరుండౌ
శ్రీ గోగినేని రంగా
ప్రాగ్భ్రము నూహాసేంచు యాంలికి తరమే?

నవంబర్ 7 ఎన్.జీ. రంగా జయంతి...)

-రాధశ్రీ

సెల్: 9494481210



## టీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఈటెల పరామర్శ

కరీంనగర్,నవంబర్6(నేటినిజం ప్రతినిధి): వివిధ కారణాలతో జిల్లాలో ఇటీవల మరణించిన వారి బాధిత కుటుంబాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ పరామర్శించారు. హుజూరాబాద్ మండలం సింగపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కిషన్ కుటుంబాన్ని అలాగే సిరసపల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## మూసీ నాలాలో మొసలి ప్రత్యక్షం

రంగారెడ్డి,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని హైదర్‌గూడ వద్ద మూసీ వాగులో మొసలి కనిపించింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై నెహ్రూ జూ పార్కు సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పార్కు సిబ్బంది.. మొసలిని పట్టుకునేందుకు యత్నించగా నీటి లోపలికి వెళ్లిపోయింది. గత వారం రోజుల్లో మొసలి కనిపించడం ఇది రెండోసారి అని స్థానికులు తెలిపారు. హిమాయత్‌సాగర్ వరద గేట్లు తెరిచిన తర్వాత మూసీలో మొసళ్లు కనిపిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అయితే మొసళ్లు నీటి నుంచి బయటకువ స్తున్న క్రమంలో అటు మూసీ వైపు ప్రజలెవరూ వెళ్లొద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

## డార్జిలింగ్‌లో బీజేపీకి షాక్.. పార్టీని వీడిన 17 మంది మున్సిపల్ కౌన్సిలర్లు

డార్జిలింగ్, నవంబర్ 6: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి గట్టిషాక్ తగిలింది. డార్జిలింగ్ మున్సిపాలిటీలో 17 ఏండ్లుగా బీజేపీలో కొనసాగుతున్న గుర్ఖా జనముక్తి మోర్చా (జీజేఎం)కు చెందిన 17 మంది కౌన్సిలర్లు ఆ పార్టీని వీడారు. బిమల్ గురుంగ్ నేతృత్వంలో తాము రానున్న ఎన్నికల్లో మమతా బెనర్జీకి మద్దతు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. 17 ఏండ్లుగా బీజేపీతో ఉన్నామని, కానీ ఆ పార్టీ తమ ఆ కాంక్షలను నెరవేర్చలేకపోయిందని అన్నారు. మమత బెనర్జీ వాగ్దానాలను నెరవేర్చడంతో 2021 లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తృణముల్ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని జీజేఎం నాయకుడు బిమల్ గురుంగ్ తెలిపారు. బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఉగ్రవాద నిరోధక చట్టం కింద గురుంగ్‌పై అభియోగాలు మోపిన నేపథ్యంలో 2017 నుంచి ఆయన అజ్ఞాతంలో ఉంటున్నారు. ‘కేసుల తొలగింపుపై రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందా.? అని ఓ విలేకరి ఆయనను ప్రశ్నించగా.. ‘నేను ఉగ్రవాదిని కాదు. దేశ వ్యతిరేకనీ కాదు. ఓ రాజకీయ నాయకుడిని. నాకు రాజకీయ పరిష్కారం కావాలి’ అంటూ ఆయన స్పందించారు. తాను రెండు నెలలుగా జార్కండ్‌లో ఉన్నానని, అంతకుముందు ఢిల్లీలో ఉన్నానని చెప్పారు. బిమల్ గురుంగ్ నేతృత్వంలోని గుర్ఖా జనముక్తి మోర్చా గతంలో ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉంది. గడిచిన మూడు సాధారణ ఎన్నికల్లోనూ ఈ పార్టీ మద్దతు కారణంగానే డార్జిలింగ్ సీటును బీజేపీ సునాయాసంగా గెలిచింది.

## లాసెట్ ఫలితాలు విడుదల చేసిన పాపిరెడ్డి

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): తెలంగాణ లా, పీజీఎల్ సెట్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ పాపిరెడ్డి ఫలితాలను విడుదల చేశారు. మూడేళ్ల లాసెట్‌లో 78. 60 శాతం ఉత్తీర్ణులు కాగా.. ఐదేళ్ల లాసెట్‌లో 62.35 శాతం, పీజీఎల్ సెట్ లో 91.04 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రకటించారు. మూడేళ్ల లాసెట్‌లో హైదరాబాద్‌కు చెందిన సీ.హెచ్.స్నేహశ్రీ (98 మార్కులు) మొదటి ర్యాంకు సాధించారన్నారు. ఐదేళ్ల లాసెట్‌లో ఎస్ఎస్‌కే. పాంచజన్య, పీజీఎల్‌సెట్‌లో టి.ప్రవల్లి మొదటి ర్యాంకులు సాధిం చినట్లు పేర్కొన్నారు. మేలో జరగాల్సిన పరీక్షలు.. మహమ్మారి కారణంగా రెండుసార్లు వాయిదా వేసిన అనంతరం నిర్వహించినట్లు తెలిపారు. కష్టసమయంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాల ప్రకటనకు కృషి చేసిన ఉస్మానియా యూనివర్సిటీ, లా సెట్ కన్వీన ర్‌తో పాటు బృందానికి, టాటా సర్వీసెస్ కన్సల్టెన్సీకి ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## 92.32శాతానికి జాతీయ కొవిడ్ రికవరీ రేటు

న్యూఢిల్లీ,నవంబర్ 6: దేశంలో పాజిటివ్ కొవిడ్ కేసుల సంఖ్య 84లక్షలు దాటింది. ఇప్పటి వరకు మహమ్మారి నుంచి కోలుకున్న వారి సంఖ్య 77.65లక్షలకు చేరుకుంది. దీంతో జాతీయ రికవరీ రేటు 92.32శాతానికి పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ చెప్పింది. దేశంలో మహమ్మారి కేసులు 84,11,724కు పెరిగాయి. ఒకే రోజు 47,638 కొత్త పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. కొత్తగా మరో 670 మంది మహమ్మారికి బలి కాగా.. ఇప్పటి వరకు 1,24,985 మృత్యువాత పడగా.. మరణాల రేటు 1.49శాతంగా ఉందని చెప్పింది. ఇప్పటి వరకు 77,65,966 కోలుకొని ఇండ్లకు వెళ్లారని మంత్రిత్వశాఖ తెలిపింది. క్రియాశీల కరోనా కేసుల సంఖ్య వరుసగా ఎనిమిదో రోజు ఆరు లక్షల కన్నా తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుతం దేశంలో 5,20,773 యాక్టివ్ కేసులున్నాయని, కేస్‌లోడ్‌లో 6.19 శాతమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వివరించింది.

# మరోమారు విజృంభిస్తున్న కరోనా

నేటినిజం
శనివారం 7-11-2020

కరోనా పీడ ఇంకా వదల్లేదు. వ్యాక్సిన్ రావడానికి మరికొంత కాలం పట్టనుంది. ఈలోగా చలికాలం రావడంతో కరోనా మళ్లీ విజృంభించే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమెరికాలో తాజాగా ఒక్కరోజే లక్షకుపైగా కరోనా కేసులు పెరిగాయి. యూరప్ దేశాల్లో మళ్లీ లాక్‌డౌన్ విధించే సంకేతాలు వస్తున్నాయి. వాతావరణ మార్పులతో సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరుగుతున్నాయి. దగ్గు, జలుబు, తుమ్ములతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చలికాలంలో ఫ్లూ సహజమే అయినా.. కరోనా ఎఫెక్ట్‌తో జనం ఆందోళన చెందుతున్నారు. దేశంలో కరోనా సెకండ్ వేవ్ వస్తుందని, మరోసారి విజృంభించే ప్రమాదం ఉందన్న ఆరోగ్యశాఖ హెచ్చరికలతో ప్రజల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. ఇన్‌ఫ్లుయెంజా లైక్ ఇల్‌నెస్ లక్షణాలతో కరోనా టెస్టుల కోసం వేలిదిమంది కరోనా టెస్టుల కోసం క్యూ కడుతున్నారు. ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలోనూ కరోనా టెస్టులకు డిమాండ్ మళ్లీ పెరుగుతోంది. మొన్నటి వరకు ప్రైవేట్ సెంటర్లలో రోజుకు 2 వేల టెస్టులు జరగ్గా, ఇప్పుడు రోజూ 3 వేల టెస్టులు చేస్తున్నారు. ఈ దశలో కరోనా బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్యసంస్థతో పాటు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా వైరస్ మరోమారు ప్రబలే అవకాశం ఉందని, ప్రభుత్వం, డాక్టర్ల సలహాలు, సూచనలను ప్రజలు పాటించాలని సూచిస్తున్నారు. చలికాలం నేపథ్యంలో వైరస్ సోకేందుకు మరో 3 నెలలు అత్యంత కీలకంగా మారనుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న క్రమంలో ఎవరికి వారు స్వీయ రోణ చర్యలు తీసుకోవాలని అంటున్నారు. రెండు నెలలుగా కరోనా ప్రభావం తగ్గిందని భావించినా, మళ్లీ పునరావృతం కావడంతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఢిల్లీలో మళ్లీ విపరీతంగ కేసుఉల పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కరోనా విస్తరణను అడ్డుకోవడానికి కొవిడ్ నిబంధనలు పాటించాలని వైద్య నిపుణులు, అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం వ్యాక్సిన్ అందు బాటులో లేదని, వచ్చినా కూడా దాని ప్రభావం ఎలా ఉంటుందో చెప్పలేమంటున్నారు. ప్రతి వ్యక్తి మాస్కు ధరించి, కనీసం 6 అడుగుల భౌతికదూరం పాటించాలని, రెండు గంటలకొకసారి చేతులను శానిటైజర్‌తోగానీ, సబ్బుతో గానీ శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రజలు గుంపులుగా చేరకుండా ఉండడమే ప్రధాన కట్టడి అన్నారు. అలాగే జనసందోహం ఉన్నచోటికి వెళ్లరాదన్నారు. ప్రయాణాలు వాయిదాలు వేసుకోవాలని, చలినుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ గా ఉందన్నారు. రానున్న రోజుల్లో దశల వారీగా కరోనా వచ్చే ప్రమాదముందంటున్నారు. దాదాపు 70శాతం ప్రజలకు లక్షణాలు కనిపించడం లేదంటున్నారు. కరోనా సోకిన వారిలో దాదాపు 5శాతం మంది ప్రజలకు మాత్రమే లక్షణాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. మిగిలిన వారు లక్షణాలు లేకుండానే విస్తరింపజేసే వారిలా ఉంటున్నారన్నారు. వైరస్ సోకిన వారు ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖా నల్లో చికిత్స పొందుతున్నారు. కొందరు హోం ఐసొలేషన్‌లో ఉంటున్నారు. కొవిడ్ నిబంధనలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటివాటికి కూడా దూరంగా ఉండవచ్చని వైద్యనిపుణులు అంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో అన్ని ప్రైవేట్ దవాఖానల్లోనూ ఉచితంగా కరోనా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులతో లక్షణాలను పోలి ఉన్న వారు కరోనాగా భావించవద్దన్నారు. వారి కోసమే అన్ని దవాఖానల్లో ఉచితంగా పరీక్షలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మరోవైపు కరోనా వైరస్ వ్యాప్తి మొదట్లో.. దాని లక్షణాలేంటో, అదెలా సోకుతుందో తెలియక వైద్యనిపుణులు, పరిశోధ కులు తల్లడిల్లారు. అయితే త్వరలోనే దీనిపై భారతీయ వైద్యులు పల్మొనాలజీ, ఇతర రంగాల వైద్యులు

స్పష్టత సాధించి మహమ్మారి కట్టడిలో మంచి ఫలితాలను సాధిస్తున్నారు. వివిధ స్థాయిల్లో మెరుగైన చికిత్స విధానాలను అవలంబిస్తూ, రోగులు ఏ లక్షణాలు, ఆరోగ్య సమస్యలతో వస్తే ఎలాంటి చికిత్స అందించా లన్న దానిలో స్పష్టత సాధించారు. ఏ మందుల కాంబినేషన్ వాడాలనే దానిపైనా స్పష్టత సాధించారు. కోవిడ్ మహమ్మారి ప్రధానంగా ఊపిరితిత్తులపై అధిక ప్రభావం చూపుతోంది. ఆ దిశగా చికిత్స అందించిన క్రమంలో తమకెదురైన అనుభవాలను శ్వాసకోశ వ్యాధుల నిపుణులు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నారు. కరోనా తగ్గిపోయినట్టుగా భావిస్తున్న 30నుంచి 40 ఏళ్లలోపు వారు బయట ఇన్‌ఫెక్ట్ అయి.. ఇళ్లలోని పెద్దలు, అనారోగ్య సమస్యలున్న వారికి అంటించే ప్రమాదం ఎక్కువుంది. చర్మంపై దద్దుర్లు, గ్యాంగ్రిన్, రక్తనాళాలు మూసుకుపోయి పేగులకు సరిగా రక్తప్రసారం జరగకపోవడం వంటివి బయట పడుతున్నాయి. ఇమ్యూనిటీ తగ్గిపోయి యూరిన్, బ్లడ్, టీబీ, ఇతర ఇన్ఫెక్షన్లు పెరుగుతున్నాయి. కొందరిలో ఊపిరితిత్తులకు నష్టం వాటిల్లి 'లంగ్ ట్రాన్స్‌ప్లాంట్' చేయాల్సిన అవసరం ఏర్పడుతోందంటున్నారు. ప్రధానంగా కరోనా కారణంగా ఊపిరితిత్తులు ప్రభావితమవుతున్నాయి. ఆపై గుండె, రక్తనాళాలు, కిడ్నీలు, మెదడుపై కొంత ప్రభావం పడుతోంది. వైరస్ నుంచి కోలుకున్నాక కూడా చాలామందిని కోవిడ్ సమస్యలు పీడిస్తున్నాయి. దీని నుంచి పూర్తిగా కోలుకునేందుకు 3 నుంచి 6 నెలలు పడుతోంది. దీర్ఘకాలం కొనసాగే కోవిడ్ సమస్యలతో ఊపిరి తిత్తులు, గుండె సంబంధ రుగ్మతలు పెరుగుతున్నట్లు గుర్తించారు. కరోనా పేషెంట్లలో దాదాపు సగం మందికి మూత్రంలో రక్తం లేదా ప్రొటీన్ కనిపించడం ద్వారా కిడ్నీ డామేజ్ ప్రారంభదశ మొదలవుతోందని కూడా వైద్యులు గుర్తించారు. స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా మాదిరిగా మన తెలుగు రాష్ట్రాల్లో సెకండ్‌వేవ్ వస్తే చాలా కష్టం. నవం బర్, డిసెంబర్‌లలో కేసులు పెరగొచ్చని, అందువల్ల మరో 6 నెలల పాటు రెండింతల జాగ్రత్తలు అవసరమని హెచ్చరిస్తున్నారు. భారత్ బయోటెక్ కంపెనీ సిద్ధం చేస్తున్న వ్యాక్సిన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశముందని ప్రభుత్వ ప్రకటించిన దరిమిలా అప్పటి వరకు మరింత జాగ్రత్తగా ఉండాలని చేస్తున్న హెచ్చరికలు ప్రజలకు మేల్కొలుపు కావాలి

## యూనివర్సిటీలకు యూజిసి మార్గదర్శకాలు త్వరలోనే తెరుచుకునేలా చర్యలు

న్యూఢిల్లీ,నవంబర్6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ విజృంభణ కారణంగా ఎనిమిది నెలలుగా మూతబడిన యూనివర్సిటీలు, కాలేజీలు తెరిచేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ మార్గదర్శకాలను జారీ చేసింది. సెంట్రల్ యూనివర్సిటీలు, కేంద్ర నిధులతో పనిచేస్తున్న విద్యా సంస్థలను తెరిచే విషయమై నిర్ణయాధికారాన్ని వాటి వైస్ చాన్సలర్లు, అధిపతులకు ఇచ్చింది. రాష్ట్ర పరిధిలో ఉన్న యూనివర్సిటీలు, కాలేజీలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలు, సూచనలకు అనుగుణంగా తెరచుకోవచ్చని సూచించింది. భౌతిక దూరం, మాస్కులు, శానిటైజర్లు వంటి కోవిడ్ నిబంధనలను పాటించాలని చెప్పింది. కంటైన్‌మెంట్ జోన్లలో విద్యా సంస్థలను తెరవరాదని యూజీసీ స్పష్టం చేసింది. కంటైన్‌మెంట్ జోన్లలో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులను రానివ్వరాదని పేర్కొంది. ఆరోగ్యసేతు యాప్ వినియోగించేలా విద్యార్థులను, అధ్యాపకులను ప్రోత్సహించాల్సిందిగా చెప్పింది. అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రత్యేక వెసులుబాట్లు చేసుకోవాలని తాజాగా జారీచేసిన మార్గదర్శకాల్లో తెలిపింది. తగిన జాగ్రత్తలతో హాస్టళ్లు తెరచుకోవచ్చని సూచించింది.

## సన్నరకం ధాన్యానికి 2500 చెల్లించాలి
### -నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలి: పొన్నం

కరీంనగర్,నవంబర్6(నేటినిజం ప్రతినిధి): సన్నరకానికి క్వింటాల్‌కు 2,500 రూపాయల మద్దతు ధర ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిఎం కేసీఆర్ మాట విని రైతులు సన్నరకం ధాన్యం సాగు చేసి నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవడంలో, ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం తగదన్నారు. రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీసీఐ ద్వారా తడిసిన పత్తిని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ బిల్లులు రైతులకు ఉరితాడు వంటివని పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతుల సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ వ్యాపార సంస్థలను అంబానీ, ఆదానీలకు ఇచ్చినట్టుగా పంటలను వ్యాపార సంస్థలకు కట్టబెట్టేందుకు వ్యవసాయ చట్టాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఈ బిల్లులను వ్యతిరేకిస్తున్నట్లు కేసీఆర్ నాటకాలు ఆడుతున్నాడని, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో వ్యవసాయ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం లేదని, కేసీఆర్ కూడా కేంద్ర చట్టాన్ని అమలు చేయ వద్దని అన్నారు. కేంద్ర వ్యవసాయ చట్టంలో మద్దతు ధర మాటే లేదని తెలిపారు. రైతులను రాజులుగా చూడాలని కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, రైతుల సంతకాలు సేకరణ ద్వారా రైతు సమస్యలను రాష్ట్రపతి దృష్టికి తీసుకు పోతామని అన్నారు.

## డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు



కరీంనగర్, నవంబర్ 6 (నేటినిజంప్రతినిధి):కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డికరీంనగర్ కమీషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు డిసెంబర్ ఒకటి వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. పైన పేర్కొన్న సాంకేతిక పరికరాలను ఈ మధ్యకాలంలో వివాహాది శుభకార్యాలు, వివిధ కార్యక్రమాల సందర్భంగా వినియోగించబడుతున్నాయని తెలిపారు. ఉగ్రవాదులు, అసాంఘీకశక్తులు వీటిని వినియోగించే అవకాశాలుండటంతో సదరు సాంకేతిక పరికరాల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని చెప్పారు. ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఐపిసి సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సంబంధిత ఎసిపిల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదు. ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్నీ సమీకరించకూడదు. పేన పేర్కొన్న ప్రాంతాలు మ్యూజిక్‌లు, పాటలు, ప్రసంగాలు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు డిసెంబర్ ఒకటి వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## దీపావళి టపాసులపై కాలుష్య నియంత్రణ మండలి ప్రచారం

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): దీపావళి పండుగ నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు. దీంట్లో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించేందుకు సమాయత్తమవుతున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల ప్రకారం పీసీబీ అధికారులు గ్రేటర్‌లో దీపావళి కాలుష్యాన్ని నమోదు చేయబోతున్నారు. శబ్దకాలుష్యంతో పాటు, వాయు కాలుష్యాన్ని సైతం లెక్కించనున్నారు. ఇందుకోసం పీసీబీ అధికారులు ప్రత్యేకంగా షెడ్యూల్‌ను రూపొందించుకున్నారు. పండుగకు ముందు, పండుగ రోజులతో పాటు, పండుగ తర్వాత ఇలా మూడు సార్లు కాలుష్య తీవ్రతలను నమోదుచేయబోతున్నారు. వీటితో పాటు పర్యావరణహిత దీపావళినే జరుపుకుందామని అవగాహన కల్పిస్తూ పీసీబీ అధికారులు పలు కార్యక్రమాలను చేపట్టబోతున్నారు.

# జీవనశైలి మార్పులతో క్యాన్సర్ వ్యాధి దూరం

(07 నవంబర్ 'జాతీయ క్యాన్సర్ అనగాహనా దినం" సందర్భంగా)

శరీరంలోన ఏదైన ఒక అవయవ భాగంలో కణజాలం అపరిమితంగా, నియంత్రణ లేకుండా పెరగడం మరియు ఇతర కణజాలానికి వ్యాపించడం వల్ల గడ్డలు ఏర్పడే అనారోగ్య స్థితిని క్యాన్సర్ వ్యాధిగా పిలుస్తారు. అతి ప్రమాదకర ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స నేటికీ లేదు. క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు మరియు తొలి దశలో గుర్తించుట వల్ల చికిత్సతో నయం చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళికి క్యాన్సర్ వ్యాధి పట్ల కనీస అవగాహన, రాకుండా ఉండానికి తీసుకోవలసిన నివారణ చర్యలు, తొలి దశలో గుర్తించే పద్ధతులు లాంటి మౌలిక అంశాలను వివరించే సదుద్దేశంతో ప్రతియేటా 07 నవంబర్ రోజున "జాతీయ క్యాన్సర్ అవగాహన దినాన్ని" 2014 నుండి పాటించడం జరుగుతోంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగపడే రేడియోషన్ థెరపీకి కారణమైన రేడియం మరియు పొలోనియం రేడియోధార్మిక మూలకాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రజ్ఞురాలు నోబెల్ బహుమతి గ్రహీత మేడమ్ మేరీ క్యూరీ జన్మ దినం 07 నవంబర్‌కు గుర్తుగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భాన్ని వినియోగించుకుంటారు. క్యాన్సర్‌లలో 100కు పైగా రకాలు ఉంటాయి. వీటిలో రొమ్ము, ఊపిరితిత్తులు, నోటి, చర్మ, గర్భాశయ, పాంక్రియాస్, ప్రోస్టేట్, ఎముకలు లాంటి అవయవాలకు క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్‌లలో కార్సినోమా (చర్మ, రొమ్ము, ప్యాంక్రియాస్, ఇతర గ్రంధులకు), సర్కోమా (రక్తనాళాలు, ఎముకలు, కార్టిలేజ్, కొవ్వు, కండరాలకు), మెలనోమా (చర్మ పిగ్మెంట్ కణాలు), లింఫోమా (లింఫోసైట్స్) మరియు ల్యుకేమియా (రక్తం) వర్గాలు ఉన్నాయి. పలు రకాల క్యాన్సర్లలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ అతి ప్రమాదకరమైందిగా గుర్తించబడింది. మన దేశంలో ప్రతి రోజు 1300 మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు మరణిస్తున్నారని తేలింది. ఇండియాలో పురుషులకు ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు స్త్రీలలో గర్భాశయ క్యాన్సర్‌లు ప్రాణాంతకంగా మారాయి.

ప్రపంచవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధులతో 71 శాతం మరణాలు నమోదు అవుతున్నాయి. ఇండియాలో అసంక్రమిత వ్యాధులతో 63 శాతం మరణాలు జరుగుతుండగా, 9 శాతం మంది క్యాన్సర్ వ్యాధులతో చనిపోతున్నారు. 1975లో ప్రారంభించిన జాతీయ క్యాన్సర్ నియంత్రణ ప్రోగ్రామ్ (నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ప్రోగ్రామ్) ద్వారా క్యాన్సర్‌కు వైద్య సదుపాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పడం, 1984-85 నుంచి నివారణ చర్యలు మరియు తొలి దశలో గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హంగేరీ, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఐర్లాండ్, యూయస్ లాంటి దేశాలలో క్యాన్సర్ బారిన పడిన వ్యాధిగ్రస్థుల శాతం ఎక్కువగా ఉంది. ప్రపంచ క్యాన్సర్ రోగుల్లో 8.17 శాతం వ్యాధిగ్రస్థులు ఇండియాలోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. భారత్‌లో 2.25 మిలియన్ల క్యాన్సర్ రోగులు ఉండగా, ప్రతియేటా 1.1 మిలియన్ల క్యాన్సర్ కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. వీటిలో దాదాపు 66 శాతం కేసులు క్యాన్సర్ ముదిరిన తరువాతనే బయట పడడంతో వ్యాధిగ్రస్థుడి ప్రాణం కాపాడడం కష్టం అవుతున్నది. ఇండియాలో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ క్యాన్సర్‌తో మరణించడం విచారకరం. భారతీయుల్లో ప్రతి పది మందిలో ఒకరికి తమ జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, చనిపోయిన ప్రతి 15 మందిలో ఒకరు క్యాన్సర్ వ్యాధితో మరణిస్తున్నారని అంచనా. 2018లో దేశవ్యాప్తంగా 3.18 లక్షల మరణాలు పొగాకు ఉత్పత్తుల అలవాటు కారణ క్యాన్సర్‌తో జరిగాయని తేలింది. పురుషుల్లో 25 శాతం క్యాన్సర్ మరణాలు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో జరగడం మరియు 25 శాతం క్యాన్సర్ మహిళా మరణాలు రొమ్ము, నోటి క్యాన్సర్‌తో జరుగుతున్నాయి. పొగాకు వాడకంతో 14 రకాల క్యాన్సర్‌లు రావడం గమనించారు. దీనికి తోడుగా ఆల్కహాల్ సేవనం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఆహారలేమి, పోషకాహారలోపం, అసురక్షిత లైంగిక సంబంధాలు, గాలి కాలుష్యం లాంటి కారణాలతో క్యాన్సర్ వ్యాధి రావచ్చనే కనీస అవగాహన కలిగి ఉండాలి.

క్యాన్సర్ వ్యాధికి ఎలాంటి ముందస్తు లక్షణాలు కనిపించని కారణంగా రోగ నిర్ధారణ చేయడం కష్టం అవుతున్నది. ఒక వేళ ముందుగా వ్యాధి నిర్ధారణ జరిగితే, చాలా సందర్భాలలో వైద్యంతో నయం చేసే అవకాశం ఉంటుంది. క్యాన్సర్ వ్యాధి లక్షణాలుగా విరోచనాలు, దగ్గు, చర్మంపై మచ్చలు ఏర్పడడం, ఉమ్మితో రక్తం పడడం, రక్తహీనత, రొమ్ములో గడ్డలు, మూత్ర సంబంధ మార్పులు, మలంలో రక్తం పడడం, బీజాలలో గడ్డలు లాంటివి గుర్తించబడతాయి. ఇండియాలో రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తులు, జీర్ణకోశ మరియు పెద్ద ప్రేగు క్యాన్సర్‌లు మాత్రమే దాదాపు 50 శాతం కనిపిస్తాయి. క్యాన్సర్ వ్యాధి చికిత్సలో ఇమ్యునోథెరపీ, కీమోథెరపీ, రేడియేషన్ థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, స్టెమ్ సెల్ మార్పిడి, శస్త్రచికిత్స, ప్రిసిషన్ మెడిసిన్ లాంటి విధానాలు వాడతారు. శరీర బరువు నియంత్రణ, మంచి పోషకాహార అలవాటు, శారీరక శ్రమ, టీకాలు వేయించుకోవడం, తీవ్రమైన ఎండ పడకుండా జాగ్రత్తలు, పొగాకు ఉత్పత్తులకు అలవాటుకు దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవడం, శరీరంలో గడ్డలు కనిపిస్తే వైద్యున్ని సంప్రదించడం వంటి సత్వర జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తల వల్ల క్యాన్సర్ వ్యాధి నివారించబడుతుంది. ప్రాణాంతర క్యాన్సర్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కలిగి, క్రమశిక్షణ గల జీవనశైలితో ఆరోగ్యకర సమాజ స్థాపనలో భాగస్వాములం అవుదాం. క్యాన్సర్‌ను సమాజం నుంచి తరిమి కొడదాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సిసిఐ మార్గదర్శకాల మేరకు పత్తి కొనుగోళ్లు
### భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

ఆదిలాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లాలో పత్తి కొను గోళ్లకు సీసీఐ సన్నద్ధమైంది. ఈ ఏడాది క్వింటాలు పత్తికి సీసీఐ ద్వారా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.5,825 చెల్లించనున్నారు. జిల్లాలో అధిక శాతం రైతులు పత్తి పంట సాగు వైపే మొగ్గు చూపడంతో దిగుబడి కూడా పెరిగింది. జిల్లాలో పత్తి పంట సాగు విస్తీర్ణం ఈ ఏడాది పది శాతం మేరకు పెరిగింది. వరుస వర్షాలు, అనేక రకాల తెగుళ్లను తట్టుకుని ప్రస్తుతం పత్తి ఏరే దశకు చేరుకుంది.

ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాస్త దెబ్బతినడంతో ఎకరానికి సుమారు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే దానిని బట్టి కేంద్రాలను పెంచే యోచనలో అధికారులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాలుకు మద్దతు ధర రూ.5,825గా ప్రకటించింది. గత ఏడాది మద్దతు ధర రూ.5,550 ఉంది. గత ఏడాది సీసీఐ ద్వారా 9,30,348 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. 2,29,769 క్వింటాళ్ల పత్తిని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన పత్తిలో 8 నుంచి 12 శాతం వరకు మాత్రమే తేమ ఉండాలి. 2 శాతం కంటే తేమ ఎక్కువ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయరు. తేమ 8శాతం ఎక్కువ ఉన్నట్లయితే ప్రతి ఒక్క శాతానికి రూ.58.25 చొప్పున ధరను తగ్గించి చెల్లిస్తారు. పత్తిపై ఎటువంటి నీరు చల్లరాదు. నీళ్లు చల్లడం వల్ల తేమ శాతం పెరిగి పత్తి రంగు మారి నాణ్యత దెబ్బతింటుంది. ముడుచుకు పోయిన పత్తిని మంచి పత్తిలో కలపరాదు. సీసీఐ పత్తికి తీసుకు వచ్చే రైతులు ఒరిజినల్ రైతు గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ తీసుకు రావాలి. కొవిడ్-19 దృష్ట్యా ప్రతి వాహనం వెంట కేవలం రైతు మాత్రమే రావాలి. ల÷తులు మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలి. సంబంధిత ఏవో ద్వారా టోకెన్లు పొంది అందులో తెలిపిన తేదీలో మాత్రమే కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకురావాలి. టోకెన్లు లేకపోతే పత్తిని కొనుగోలు కేంద్రంలోకి అనుమతించరు. కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లోని ఎలక్ట్రానిక్ కాంటాలు, కంప్యూటర్‌లు, ప్రింటర్లు, వేబ్రిడ్జిలతో పాటు అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

# రైతుల సంక్షేమమే సిఎం కెసిఆర్ లక్ష్యం
### విపక్షాల మాటలు పట్టించుకోవద్దు
### ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు: ఎమ్మెల్యే

నిజామాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ):రైతుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. రైతులు విపక్షాల మాటలతో నష్టపోవద్దన్నారు. ధాన్యం ఏదైనా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సిఎం ఆదేశాల మేరకు మక్కలు, సన్నాల ధాన్యం కొనుగోళ్లకు ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. పత్తి, ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, చివరి గింజ వరకూ కొంటామని భరోసానిచ్చారు. రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి కెసిఆర్ లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసమే కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తున్న దన్నారు. ఇది రైతు ప్రభుత్వమని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికలు అమలుచేస్తామని చెప్పారు. గతం కంటే ఈసారి ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి వెంటనే కొనుగోళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు రైతులు సన్నరకాలు సాగు చేశారని ఆఖరి గింజ వరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గతం కంటే ఈసారి దిగుబడి ఎక్కువ వచ్చే వస్తుందనే అంచనాల మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నిబంధనల ప్రకారం తేమ, తాలు శాతం ఎక్కువ లేకుండా ఆరబెట్టి తీసుకొస్తే వెంటనే కొనుగోలు చేయడంతో పాటు రైస్‌మిల్లాల్లతోనూ ఇబ్బంది ఉండదన్నారు. ఈ విషయమై అధికారులు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్ని రోజులైనా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తొందరపడి తేమ, తాలు ఉన్న ధాన్యం తేవద్దని ఆయన కోరారు. గత యాసంగిలో కరోనా సమస్యతో ఇబ్బందులున్నా సీఎం ఆదేశాల మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా ధాన్యం కొనుగోలు చేశారని జీవన్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఆ ఇబ్బందులేవీ లేవని అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. అలాగే కేంద్రాలు, రవాణా వాహనాలు, గోదాముల సంఖ్యను పెంచడమే గాక కేంద్రాల వద్ద పర్యవేక్షణ చేపట్టారని అన్నారు. ధాన్యం, పత్తి కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. అన్ని మార్కెట్ యార్డుల్లో సీసీఐ ద్వారా పత్తి, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. పత్తిలో కూడా తేమ శాతం 12లోపు ఉండేలా చూడడంతో పాటు గన్నీ బ్యాగుల్లో తీసుకురావద్దన్నారు. ప్రభుత్వం వద్దన్నా కొందరు రైతులు మక్క సాగుచేశారని, వారు నష్టపోవద్దని సీఎం కేసీఆర్ ఆలోచించి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు
### -పత్తి కొనుగోళ్లకు 24 కేంద్రాలు ఏర్పాటు

వరంగల్,నవంబర్6(ఆర్ఎన్ఎ): అర్బన్ జిల్లాలో ఈ వానకాలంలో ధాన్యం కొనుగోలుకు 101, పత్తి కోసం 24 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. గత యాసంగిలో ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. క్లస్టర్లు ఏర్పాటు చేసి 45వాహనాల ద్వారా ధాన్యం తరలించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఇదిలావుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్లు రైతులు నియంత్రణ విధానంలో సాగు చేసి ఆయన నమ్మకాన్ని నిలబెట్టారని అర్బన్ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ రాథోడ్ అన్నారు. సీఎం చెప్పినట్లు సన్నాలే ఎక్కువ వేశారని కొద్దిమంది మాత్రమే దొడ్డు వరి, మక్కలు వేశారన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సీఎం హామీ ఇచ్చారన్నారు. ఎప్పటిలాగే ఈసారి కూడా పత్తి, పసుపు వంటి వాణిజ్య పంటలు వేశారన్నారు. కలెక్టర్లు, వ్యవసాయ, సివిల్ సప్లయ్, మార్కెటింగ్, సీసీఐ అధికారుల సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ చేపట్టారని అన్నారు. గత యాసంగి సీజన్‌లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కేంద్ర విధివిధానాల వల్ల విదేశాల నుంచి కూడా 5లక్షల మెట్రిక్ టన్నుల మక్కలు మన దేశానికి వచ్చాయని గుర్తుచేశారు. ఇకనుంచి ఇక్కడి అవసరాల కోసం మాత్రమే పంటలు వేసి, ఎవరూ నష్టపోకుండా చూడాలని రైతును ప్రత్యేకంగా కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇదిలావుంటే ఈసారి జిల్లాలో 4.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశముందని ఎమ్మెల్యే అన్నారు. ధాన్యం అమ్మేందుకు రైతులు ఎదురుచూడాల్సిన సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారని అన్నారు. గత సీజన్‌లో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు సమన్వయంతో విజయవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేశారని ఎమ్మెల్యే అన్నారు. రవాణా విషయంలో గతంలో వలె ఇబ్బందులేకుండా చూడాలన్నారు. ధాన్యం కోసిన తర్వాతే టోకెన్లు ఇవ్వాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇతర దేశాల నుంచి మక్కలు దిగుమతి చేసుకుంటున్నారని అన్నారు. ఈసారి మక్కలు కొనుగోలు చేసేందుకు కోళ్ల రైతులు కూడా ముందుకురావడం లేదని, ఈ పరిస్థితుల్లో రైతులు అప్పులపాలు కావద్దని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అందుకే ఇక నుంచి మక్కలు వేయవద్దని కోరారు.

## ధాన్యం సేకరణలో అలసత్వం తగదు: కలెక్టర్

కామారెడ్డి,నవంబర్6(ఆర్ఎన్ఎ): ధాన్యం సేకరణలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శరత్ హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రోజువారీగా కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతుల పేర్లను ఏఈవోలు నమోదు చేసుకొని టోకెన్లు ఇవ్వాలని సూచించారు. సేకరించిన ధాన్యం వివరాలను ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురైతే సమాచారం అందించాలని రైతులకు సూచించారు. మీసేవ కేంద్రాల వద్ద ధరణి పోర్టల్‌లో స్లాట్ బుకింగ్‌కు రూ.200 చెల్లించాలనే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదిలావుంటే ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్పష్టం చేశారు. హమాలీలు, గన్నీబ్యాగులు, తూకంయంత్రాల కొరత తదితర సాకులు చూపుతూ రైతులను ఇబ్బందులకు గురిచే యొద్దని అన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు.

## కొనసాగుతున్న అమరావతి ఆందోళనలు

అమరావతి,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, మహిళలు చేపట్టిన నిరసనలు 325వ రోజుకు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం,ఎర్రబాలెం, ఉద్దండరాయునిపాలెం, రాయపూడి, నీరుకొండ, అనంతవరం, పెదపరిమి, ఐనవోలు, నెక్కల్లు తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది.

## సన్న ధాన్యానికి రూ.2500గా మద్దతు ధర నిర్ణయించాలి

నల్లగొండ,నవంబర్6(ఆర్ఎన్ఎ): రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, సన్న ధాన్యానికి రూ.2500గా మద్దతుధర ఖరారు చేయాలని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు.నియంత్రిత విధానం కారణంగా అధికంగా సాగైన సన్నరకం వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నారు.

మద్దతు ధర కల్పించాలని రైతులు రోడ్డెక్కడం చూసీ పట్టించుకోక పోవడం సరికాదన్నారు. మిర్యాలగూడ పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో రైతులకు మద్దతు ధరకు కొంచెం అటు ఇటుగా రేటు గిట్టుబాటవుతోంది. సూర్యాపేట జిల్లాలో ఆ పరిస్థితి లేకపోవడంతో అక్కడి రైతులు మిర్యాలగూడ బాటపట్టారు. దీంతో మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం వస్తుండటంతో, పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చేందుకే వరికోత యంత్రాలకు అధికారులు సెలవు ప్రకటించారు. టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మిర్యాలగూడ పట్టణ మిల్లుల సామర్థ్యం రోజుకు 2వేల నుంచి 3వేల ట్రాక్టర్లు కాగా, సూర్యాపేట జిల్లానుంచి కూడా ధాన్యం వస్తుండటంతో అది 5వేలకు చేరింది. ఇక ట్రాక్టర్లలో పరిమితికి మించి ధాన్యాన్ని కుక్కుతుండటంతో కింది భాగంలో తేమతో గింజ నల్లబారుతోంది. దీంతో రైతుకు గిట్టుబాటు ధర దక్కడంలేదని, దీన్ని వారు గమనించాలని అధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరించడంతో రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోయాయి. ధాన్యం నాణ్యతగా లేదని వాటిని దిగుమతి చేసుకునేందుకు మిల్లర్లు నిరాకరించడంతో లారీలు మిల్లుల వద్దే నిలిచిపోయాయి. ఇలా రోడ్డెక్కిన రైతులకు తోణ న్యాయం చేయాలని డిసిసి నేత కోరారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర : ఎమ్మెల్యే ఆత్రం సక్కు



కుమ్రం భీం ఆసిఫాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): జిల్లాలో శుక్రవారం పత్తి కొనుగోళు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలు జిన్నింగ్ మిల్లుల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు పూజలు నిర్వహించి కొనుగోళ్లు ప్రారంభించారు.

ప్రభుత్వం సీసీఐ ద్వారా నిర్ణయించిన మద్దతు ధరకే రైతులు తమ పత్తిని విక్రయించాలని సూచించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేమ శాతం 12 లోపు ఉండేలా చూసుకోవాలని రైతులను కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 5,825 రూపాయలకు మాత్రమే రైతులు తమ పత్తిని విక్రయించాలని, బయట దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రతిరోజూ జిన్నింగ్ మిల్లుల్లో వ్యవసాయ అధికారులు, మార్కెట్ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన పత్తి పంట పూర్తిగా కొనుగోళ్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. పత్తిని విక్రయించేందుకు వచ్చిన రైతులు తమ పట్టా పాసుపుస్తకాలు ఆధార్ కార్డులు బ్యాంక్ అకౌంట్లు జిరాక్సు తీసుకుని రావాలన్నారు.

# తీగలకు గాలం వేసిన బిజెపి నేతలు ?

## –ఆయనతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): గ్రేటర్ ఎన్నికలపై తీవ్రంగా దృష్టి పెట్టిన బిజెపి నేతలను ఆహ్వానించే పనిలో పడింది. గతంలో వివిధ పదవులు నిర్వహించి ఖాళీగా ఉన్న వారిని పార్టీలకి ఆహ్వానించడం ద్వారా పార్టీకి ఊపు తేవాలని చూస్తోంది. ఇందులో భాగంగా గతంలో మేయర్‌గా పనిచేసిన తీగల కృష్ణారెడ్డిని బిజెపిలోకి రప్పించేయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే విజయశాంతిని వెనక్కి తీసుకుని వచ్చే పనిలో పడ్డారు. తాజాగా తీగలపై వల వేశారని తెలుస్తోంది. బిజెపితోపొలిటికల్ డీల్ కుదిరితే టీఆర్ఎస్‌కు ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి షాకివ్వనున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని కథనాలు వినపడుతున్నాయి. కారు దిగి కమలం గూటికి చేరుతున్నట్టు సమాచారం. ఈ మేరకు బీజేపీ నేతలతో ఆయన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా తీగల కృష్ణారెడ్డి టీఆర్ఎస్‌కు దూరంగా ఉంటూ వస్తున్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ.. టీఆర్ఎస్ అసంతృప్తులకు గాలం వేస్తోంది. ఈ నేపథ్యంలో తీగల కృష్ణారెడ్డితో బీజేపీ సీనియర్ నేతలు చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచిన తీగల కృష్ణారెడ్డి.. కొద్దిరోజులకే గులాబీ కండువా కప్పుకున్నారు. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. ఈ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డి గెలుపొందారు. అయితే ఆమె సైతం కారెక్కడంతో.. తీగలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే ఆయనకు ఎమ్మెల్సీ సీటు గ్యారంటీ అన్న భరోసా పార్టీ అగ్రనేతల నుంచి రావడంతో కాస్త శాంతించారు. కానీ ఇప్పటి వరకు ఆయనకు ఎలాంటి పదవీ దక్కకపోవడంతో పార్టీ మారడానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ దక్కితే కారు దిగేది లేదన్న సంకేతాలు ఇస్తున్నారు.

# ఘోర పడవ ప్రమాదంలో 70 మంది గల్లంతు...!

## –100 మందితో వెళ్తున్న పడవ గంగానదిలో మునక

పాట్నా,నవంబర్6(ఆర్ఎన్ఎ): బీహార్‌లోని గంగానదిలో ఘోర ప్రమాదం జరిగింది. పడవ మునిగి ఒకరు మతి చెందగా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. పలువురు గల్లంతయ్యారు. స్థ్రంలోని భాగల్‌పూర్ జిల్లా నవ్‌గచ్చియా ప్రాంతంలో గురువారం స్థానికులు దర్శనీయా ఘాట్ నుంచి తీన్‌టంగా ఘాట్‌కు వెళ్లడానికి 100 మందికి పైగా పడవ ఎక్కారు. కొంతదూరం వెళ్లిన తరువాత ఆ పడవ బోల్తా పడింది. విషయం తెలియగానే ఒడ్డునే ఉన్న మత్స్యకారులు అక్కడికి వెళ్లి 30 మందిని రక్షించారు. ఈ ప్రమాదంలో సులేమా దేవి అనే మహిళ మతి చెందగా ఐదుగురు పరిస్థితి విషయమంగా ఉండడంతో సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరొకొని సహాయక చర్యలు చేపడుతున్నారు. కాగా శనివారం మూడోదశ పోలింగ్ ఉండడంతో ఓటేసేందుకు వీరు పడవ ఎక్కి వెళ్తున్నట్లు తెలుస్తోంది.

# రైతును వ్యవసాయానికి దూరం చేసేలా బిల్లు

## వ్యవసాయ బిల్లులను ఉపసంహరించుకోవాలి

## తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్

వికారాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ బిల్లులను ఉపసంహరించుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణికం ఠాగూర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ బిల్లుకు వ్యతిరేకంగా చేవెళ్లలో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా మాణికం ఠాగూర్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ పేరుతో టీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి పాలనను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించరు? అని మాణికం ఠాగూర్ నిలదీశారు. వ్యవసాయ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళనకు పిలుపునిచ్చింది. రైతును వ్యవసాయానికి దూరం చేసేలా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వ్యవసాయ బిల్లును ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతి, గవర్నర్‌లకు పంపుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఈ చట్టంతో మార్కెట్లు మూతపడి ప్రైవేటు వ్యాపారస్తుల చేతిలో వ్యవసాయదారులు నష్టపోయే ప్రమాద ముందన్నారు. 23 పంటలకు మద్దతు ధర ఇవ్వాల్సి ఉండగా కేవలం వరి, గోధుమలనే కొనుగోలు చేస్తారని తెలిపారు.

# గ్రేటర్‌పై బీజేపీ ఫోకస్

## అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ..

## గెలుపు గుర్రాలకై అన్వేషణ

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల హడావిడి ముగిసింది. గెలుస్తారా ? ఓటమి పాలు అవుతారా ? అనే విషయం పక్కన పెడితే దుబ్బాక ఉప ఎన్నికలో బిజెపి, టిఆర్ఎస్ పార్టీకి చెమటలు పట్టించింది. దుబ్బాక ఉప ఎన్నిక పోరులో పెద్ద యుద్ధమే చేసింది. ఇక ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు నవంబర్ నెలలో నోటిఫికేషన్ వస్తుందన్న సంకేతాలు వస్తున్న నేపథ్యంలో గ్రేటర్ ఎన్నికలపై దష్టి పెట్టింది బిజెపి. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గతంలో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో, అప్పుడు బిజెపి నుండి గ్రేటర్లో ముఖ్య నేతలు ఉన్నప్పటికీ చెప్పుకోదగిన ఫలితాలను రాబట్టలేకపోయింది. గతంలో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నా కార్పొరేటర్ల ను గెలిపించుకోలేక పోయారు. ఇక ఇప్పుడు గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఒక ఎమ్మెల్యే సీటు పరిమితమైంది. కానీ ఎమ్మెల్యేగా ఓటమిపాలైనా, ఎంపీగా కిషన్ రెడ్డి విజయం సాధించి, ఏకంగా కేంద్రమంత్రిగా పదవిలో కొనసాగుతున్నారు. అంతేకాకుండా బిజెపి అగ్రనాయకత్వం దూకుడు చూపించగలిగిన నేత అయిన బండి సంజయ్ కు రాష్ట్ర పగ్గాలు అప్పగించి దూసుకుపోవాలని సూచించింది. దీంతో గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అధికార టీఆర్ఎస్ పై దూకుడుగానే వెళుతున్నారు. మొన్న దుబ్బాక ఎన్నికల్లోనూ దీటుగా ప్రచారం చేసిన సంజయ్, ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల కసరత్తు మొదలుపెట్టారు.గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ క్షేత్రస్థాయిలో కేడర్ ను యాక్టివ్ చేస్తున్నారు సంజయ్. గ్రేటర్ హైదరాబాద్ లో పట్టు సాధించడం కోసం ఇప్పటికే నలుగురు అధ్యక్షుల ఎ÷–లాన్ ను అ÷–లపై చేసింది. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఈ ఎ÷–లాన్ వర్కవుట్ కావడంతో గ్రేటర్ హైదరాబాద్ లోనూ ఇదే తరహాలో ముందుకు వెళ్లాలని భావిస్తోంది. టిఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన నెరవేర్చని హామీలను, ఇటీవల వర్షాలు వరదల కారణంగా హైదరాబాద్ పరిస్థితిని ప్రధాన ప్రచార అస్త్రాలుగా మలచుకొని గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల వెళ్లాలని బిజెపి భావిస్తోంది.

ఈ నేపథ్యంలో గట్టిగా ప్రచారం చెయ్యటంలో సక్సెస్ అయితే బీజేపీ మెరుగైన స్థానాలు సాధించే అవకాశం ఉంటుంది. టిఆర్ఎస్ పార్టీ వరద సహాయాన్ని అందిస్తున్నామని రూ.10000 పంచుతూ ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను, సానుకూలత గా మార్చుకునే ప్రయత్నం చేస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన వారిని చివరి నిమిషంలో హడావుడిగా ఎంపిక చేయడం కాకుండా ముందుగానే దరఖాస్తు చేసుకునేందుకు బిజెపి అవకాశం కల్పించింది. ఆసక్తి ఉన్నవారి దరఖాస్తులను పరిశీలించి, అందులో ఎవరైతే విజయం సాధిస్తారు అనే విషయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వారికే టిక్కెట్లు ఇవ్వాలని, ఖచ్చితంగా గెలుపు గుర్రాలకే అవకాశం ఇవ్వాలని బిజెపి నేతలు భావిస్తున్నారు. ఈ బాధ్యతను జిల్లా అధ్యక్షులకు అప్పగించారు. గ్రేటర్ ఈ ఎన్నికల్లో కచ్చితంగా కాషాయ జెండా ఎగరవేసేలా ప్రతి ఒక్కరు కషి చేయాలని రాష్ట్ర నాయకత్వం గ్రేటర్ హైదరాబాద్ లోని బిజెపి నాయకులకు దిశానిర్దేశర చేస్తున్నారు. మొత్తానికి ఈసారి గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోనూ సత్తా చాటటానికి కావలసిన సన్నాహాలను చేపట్టి వ్యూహాత్మకంగా బిజెపి ముందుకు వెళ్తోంది.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కోసం రూ. 600కోట్లు విడుదల

## –విడుదల చేస్తూ గృహనిర్మాణశాఖ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేసింది ప్రభుత్వం. గ్రేటర్ హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాల్లో చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఈ నిధులు ఖర్చు చెయ్యనున్నారు. ఈ పథకానికి మొత్తం రూ.600 కోట్లను విడుదల చేస్తూ గహనిర్మాణశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రూ.3,750 కోట్లను ప్రభుత్వం కేటాయించగా.. అందులో భాగంగా అంతుకుముందు రూ.150 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. తాజాగా మరో రూ.600కోట్ల విడుదలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పేదలకు గూడు కల్పిచేందుకు తెలంగాణా ప్రభుత్వం నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని త్వరితగతిన పూర్తి చెయ్యాలని ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది.

# బిజెపిలో నంబర్ 2 ఎవరన్నదానిపై సస్పెన్స్

## లీడర్లు ఎదగకుండా ఏకఛత్రాధిపత్యంలోకి వచ్చిన పార్టీ

## వాజ్‌పేయ్,అద్వానీ,జోషి లాంటి నేతలు కరవు

న్యూఢిల్లీ,నవంబర్6(ఆర్ఎన్ఎ): బిజెపిలో ఒకప్పుడు నేతలు ఒకిరిని మించి ఒకరు అన్నట్లుగా ఉండేవారు. వాజ్‌పేయి, అద్వానీ, మురళీమనోహర్ జోషి, ప్రమోద్ మహాజన్, సుష్మాస్వరాజ్, వెంకయ్యనాయుడు ,జైట్లీ వంటి ఉద్దండులు ఉండేవారు. వారుపోతే వీరు అన్నట్లుగా పార్టీ బలిష్టంగా ఉండేది. అలాగే పార్టీలో ఎప్పుడూ ఏకఛత్రాధిపత్యానికి తావు లేకుండా ఉండేది. అందుకే పార్టీలో లీడర్ల సమస్య రాలేదు. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అద్వానీ, మురళీమనోహర్ లాంటి వారు కురువృద్దులు కావడంతో వారిని పక్కకు పెట్టారు. అయితే అధికారం ఉంది కనుక ఫర్వాలేదు కానీ..అధికారం లేకపోతేనే పార్టీని సమర్థంగా నడిపించడానికి నేతలు కావాలి. బిజెపిలో ఇప్పుడు మోడీ ఒక్కడే నేతగా ఉన్నారు. ప్రాంతీయ పార్టీల మాదిరి ప్రభుత్వం, పార్టీ అంతా ఆయన కనుసన్నల్లోనే నడుస్తోంది. రాజ్‌నాథ్ సింగ్,అమిత్‌షాలు ఉన్నా వారు రెండో స్థానం అని చెప్పడానికి లేదు. కేంద్రంలో అధికారంలో ఉండడం, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉండడం బిజెపికి కలిసి వస్తోంది. దీనికితోడు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు కూడా బిజెపిని బలోపేతం చేశాయి. ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి పెట్టాయి. ఆర్టికల్ 370 రద్దు, ట్రిబుల్ తల్లాఖ్, అయోధ్య వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కింది. అలాగే అవినీతి రహిత పాలన అన్న పేరు కూడా వచ్చింది. కాశ్మీర్‌లో మళ్లీ 370ని పునరుద్దరిస్తా మంటున్న కాశ్మీర్ నేతలకు కాంగ్రెస్ తోడు కావడం బిజెపికి కలసి వచ్చే అంశం. దీనిని భారతీయులు ఎవరు కూడా జీర్ణించుకోలేరు.

మొత్తంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో మోడీ బలమైన నాయకుడుగా దేశంలో,ప్రపంచంలో పేరు పొందారు.

అతిపెద్ద భారత ప్రజాస్వామ్య దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా చిన్న అసమ్మతి కూడా వ్యక్తం కావడం లేదు. పార్టీలో ఆయన మాటను కాదనే వారు లేరు. అలాగే ప్రభుత్వంలోనూ పెద్దగా వ్యతిరేకత లేదు. వెంకయ్యనాయుడు లాంటి వారిని పార్టీకి దూరంగా పెట్టారు. లోక్‌సభలో బిజెపి ఎంపీల్లో అనేకమంది మొదటి సారి ఎన్నికైన వారే. వారంతా మోదీ, అమిత్ షాలు టికెట్ ఇవ్వడంతో పార్లమెంట్ గడపదొక్కిన వారే. మోదీ హవా వీయకపోతే బిజెపి ఎంపీల్లో అత్యధిక శాతం గెలిచేవారు కాదు. అనేక మంది క్రింది స్థాయి పార్టీ కార్యకర్తలను మోదీ, అమిత్ షాలు అభ్యర్థులుగా ఎంచుకున్నారు. వారు రాజకీయ ప్రకటనలు చేయడం కానీ, సెంట్రల్ హాలులో చర్చలు జరపడం కానీ చేసిన సందర్భాలు తక్కువ. చిన్న సంకేతం ఇస్తే చాలు పూర్తి మెజారిటీతో ఉభయసభలకు హాజరై పార్టీ నేతలు ఏది చెబితే అది చేస్తారు. ఈ కారణంగా పార్టీలో, ప్రభుత్వంలో మోడీ పట్టు సాధించారు. తొలినాళ్లలో మోదీకి గాడ్ ఫాదర్ అయిన లాల్ కృష్ణ అద్వాణీ వాజపేయిని ఒప్పించి మరీ నరేంద్రమోదీని గుజరాత్ ముఖ్యమంత్రిగా పంపించారు. ఆ తర్వాత మోదీ గుజరాత్‌లో పార్టీలో ప్రత్యర్థి వర్గాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. స్వయంగా కేశుభాయి పటేల్ మోదీకి వ్యతిరేకంగా అసమ్మతి శిబిరాన్ని నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు కేశుభాయి పటేల్, సురేశ్ మెహతా స్వయంగా ఢిల్లీ వచ్చినా ఎవరూ పట్టించుకోలేని స్థితి ఏర్పడింది. మోదీ ఎవరి పేరు చెబితే వారిని ఢిల్లీలో పార్టీ సస్పెండ్ చేసేది. ఎమ్మెల్యేలను కూడా పార్టీ క్షమించేది కాదు. ఒక దశలో సీనియర్ నేతలతో సహా 60 మంది ఎమ్మెల్యేలు మోదీ వ్యవహార శైలిని, నియంతృత్వ ధోరణులను విమర్శించారు. కాని ఢిల్లీలో వెంకయ్య, రాజ్‌నాథ్ సింగ్, అరుణ్ జైట్లీ, జవదేకర్ తదితర నేతలు మోదీకి అనుకూలంగా వ్యవహరించే వారు. తనను ఢిల్లీ పంపించడంలో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన గుజరాత్ పార్టీ ప్రధానకార్యదర్శి సంజయ్ జోషీని కూడా సస్పెండ్ చేయించడంలో మోదీ కృతకృత్యులు కాగలిగారు. గత వారం తన 92వ ఏట మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి కేశుభాయి పటేల్ ఒక దశలో మోదీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. 1950లలో జనసంఘ్ సంస్థాపక సభ్యుడుగా ఉన్న కేశుభాయికి గుజరాత్‌లో పార్టీని బలోపేతం చేసిన ఘనమైన చరిత్ర ఉన్నది. చివరకు ఆయన కూడా మోదీ ఎత్తులకు చిత్తయిపోయారు. విచిత్రమేమంటే కేశుభాయి తనను ఎంత విమర్శించినా మోదీ పల్లెత్తు మాట అనలేదు. ఎక్కడ కలిసినా పాదాలకు నమస్కరించేవారు. ఇటీవల కేశుభాయి పటేల్ మరణించినప్పుడు ఆయన తండ్రి లాంటి వాడని, తనకు రాజకీయ గురువు అని మోదీ చెప్పుకున్నారు. సరే, గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి రథయాత్ర ప్రారంభించినప్పుడు నరేంద్ర మోదీని చేరదీసి ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించిన ఆద్వాణీకి కూడా తాను శిష్యుడినని మోదీ పలు సార్లు చెప్పుకున్నారు. అదే అద్వానీని రాష్ట్రపతి చేయకుండా మోడీ పక్కన పెట్టారు. ఈ నేపథ్యంలో మోదీపై పార్టీలో అసమ్మతి వస్తుందని ఎవరైనా ఊహిస్తే అది భ్రమే అవుతుంది. ఈ దశలో మోడీ తరవాత ఎవరన్న ప్రశ్న రాకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్టీలో తరవాత ఎవరు అన్నదానికి ఇప్పుడు బిజెపి ప్రశ్న ఉత్పన్నం కావడం లేదు.

# నెరవేరనున్న బైడెన్ మూడున్నర దశాబ్దాల కల

## అంచెలంచలుగా ఎదిగిన మధ్యతరగతి మానవుడు

## ఉపాధ్యక్షుడుగా ఒబామాకు వెన్నుదన్ను

వాషింగ్టన్,నవంబర్6(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షపీఠానికి జోబైడెన్ (77).. చేరువగానే ఉన్నారు. ఎన్ని ఎత్తులు వేసినా ఆయన శ్వేతసౌధంలో అడుగుపటెట్టం ఖాయంగా కనిపిస్తోంది. ట్రంప్ ఎన్ని ఎత్తులు వేసినా అవి ఫలించే సూచనలు కానరావడం లేదు. జో బైడెన్ మూడున్నర దశాబ్దాల కల అధ్యక్ష పదవి ఇప్పుడు నెరవేరబోతున్నది. ఈ పదవిని అధిష్టించేందుకు ఆయన 1988లో ప్రయత్నించారు. కానీ, పార్టీ తరపున అభ్యర్థిత్వాన్ని దక్కించుకోవడంలో విఫలమయ్యారు. మళ్లీ 2008లో కూడా ప్రయత్నించారు. అప్పుడూ ఒబామా, హిల్లరీ కరిష్మా ముందు తేలిపోయారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌తో సై అంటే సై అన్నట్టుగా ఢీకొని, గెలుపు దిశగా దూసుకుపోతున్న బలమైన ప్రత్యర్థిగా అవతరించారు. 2016లో హిల్లరీ క్లింటన్ ఇచ్చిన పోటీ కంటే బలమైన పోటీతో బెంబేలెత్తించిన బైడెన్‌ను అమెరికా రాజకీయాల్లో ముద్దుగా 'మిడిల్ క్లాస్ జో' అని పిలుచుకుంటారు. బరాక్ ఒబామా బృందంలో సభ్యుడిగా, ఆ సమయంలో అమెరికా ఉపాధ్యక్షుడిగా వ్యవహరించిన సంగతి మాత్రమే మనలో చాలా మందికి తెలుసు. ముచ్చటగా మూడోసారి.. అంటే ఇప్పుడు మాత్రం డెమొక్రాటిక్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి నామినేట్ కావడంలో విజయం సాధించారు. 1942 నవంబరు 20న.. పెన్సిల్వేనియాలోని స్క్రాన్‌టన్‌లో బైడెన్ జన్మించారు. బైడెన్ చిన్నప్పుడే ఆయన కుటుంబం డెలవేర్‌లో స్థిరపడింది. నిజానికి వారిది సంపన్న కుటుంబమేగానీ.. బైడెన్ పుట్టే సమయానికి ఆయన తండ్రి తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయి ఉన్నారు. దీంతో చాలాకాలంపాటు బైడెన్ కుటుంబం పేదరికంలో గడిపింది. తర్వాత కొద్దిగా కోలుకుని మధ్యతరగతి జీవనం గడిపింది. బైడెన్‌లో చిన్నప్పటి నుంచి నాయకత్వ లక్షణాలు అధికం. ఈ క్రమంలోనే స్కూల్ లీడర్‌గా వ్యవహరించారు. 1965లో చరిత్ర, రాజనీతి శాస్త్రంలో బీఏ చేశారు. బైడెన్‌కు మొదట్లో నత్తి ఉండేది. కానీ, అద్దం ముందు నుంచి కవితలు చదవడం ద్వారా ప్రయత్నపూర్వకంగా దానిపై ఆయన విజయం సాధించారు.

1966లో ఆయనకు తొలిసారి వివాహమైంది. ఆయన మొదటి భార్య నీలియా హంటర్. వారికి ముగ్గురు పిల్లలు. 1968లో బైడెన్ న్యాయశాస్త్రంలో పట్టా పొంది ఒక న్యాయసంస్థలో పనిచేశారు. అప్పట్లో ఆయనకు డెలవేర్ గవర్నర్ అయిన డెమొక్రాటిక్ నాయకుడి విధానాలపై ఆగ్రహం ఉండేది. రిపబ్లికన్ అభ్యర్థి భావాలు నచ్చేవి. అయితే, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి రిచర్డ్ నిక్సన్ అంటే ఇష్టం ఉండేది కాదు. 1969లో ఆయన.. డెమొక్రాటిక్ పార్టీలో చురుగ్గా వ్యవహరించే ఒక వ్యక్తి నిర్వహించే న్యాయసంస్థలో పనిచేశారు. అక్కడ ఉండగానే ఆయన తన భావాలు మార్చుకొని డెమొక్రాట్‌గా తన పేరు నమోదు చేసుకున్నారు. అలా ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. తొలుత స్థానిక కౌంటీ కౌన్సిల్‌కు ఎన్నికైన బైడెన్.. 1972లో జూనియర్ సెనెటర్‌గా ఎన్నికయ్యారు. చేతిలో డబ్బుల్లేకపోవడంతో.. ఆయన కుటుంబసభ్యులు ఇంటింటికీ తిరగి కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. ఆయన ప్రత్యర్థి భారీగా ప్రచారం చేశారు. అయినా బైడెనే గెలిచారు. దురదృష్టవశాత్తూ ఆ ఏడాది ఆయన భార్య, ఏడాది వయసున్న కుమార్తె ప్రమాదంలో చనిపోయారు. ఆ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన కుమారులిద్దరూ ఆస్పత్రిలో ఉండగా.. సెనెట్ సభ్యుడుగా బైడెన్ ఆస్పత్రిలోనే ప్రమాణ స్వీకారం చేశారు. 1977లో ఆయన జిల్ ట్రేసీ జాకబ్స్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమార్తె. 30 ఏళ్ల వయసుకే సెనెటర్‌గా ఎన్నికైన బైడెన్ చురుగ్గా పనిచేయడంతో టైమ్ మేగజైన్ 1974లో ఆయన్ను '200 ఫేసెస్ ఫర్ ద ఫ్యూచర్'లో ఒకరిగా పేర్కొంది. సెనెటర్‌గా ఆయన వినియోగదారుల హక్కులు, పర్యావరణ అంశాలపై ఎక్కువగా దృష్టిసారించారు. సెనెట్‌కు సంబంధించిన పలు కమిటీలకు నాయకత్వం వహించారు.రాజకీయంగా ఒక్కొక్క మెట్టే ఎదుగుతూ వచ్చారు. 1988 ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం ఆశపడినా.. ఆయన ప్రచార బృందం చేసిన కొన్ని తప్పుల వలన, ఆయన గతంలో చేసిన కొన్ని తప్పుల వల్ల అభ్యర్థిత్వం దక్కలేదు. మళ్లీ 2007లో కూడా ప్రయత్నించి 2008 జనవరిలో ఆ ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నారు. ఆ ఏడాది డెమొక్రాట్ అభ్యర్థిగా నామినేట్ అయిన ఒబామా.. బైడెన్ సమర్థతను గుర్తించి, ఆయనను పిలిచి మరీ ఉపాధ్యక్షుడిగా చేసుకున్నారు. అధ్యక్షుడిగా ఒబామా తీసుకున్న పలు నిర్ణయాల్లో బైడెన్ కీలకపాత్ర పోషించారు.

# రైతువ్యతిరేక బిల్లులను ఉపసంహరించుకోవాలి

కర్నూలు,నవంబర్6(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక బిల్లులను తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు.కేంద్రం తీసుకువచ్చిన బిల్లులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ మోటార్లకి మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని ఆయన కోరారు. కేంద్రంలో నరేంద్రమోదీ విధానాల వల్ల వ్యవసాయ రంగం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే ప్రమాదకర బిల్లులను తీసుకువస్తోందని అన్నారు. ఈ మూడు బిల్లులను పతిపక్షాలు పార్లమెంట్‌లో అడ్డుకున్నప్పటికీ మోదీ ప్రభుత్వం ఆమోదింపజేసుకుందని అన్నారు. వీటి వల్ల రాబోయే రోజుల్లో రైతుల భూములన్నీ కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోవడమే కాక, పండించిన పంటలు కూడా రైతులు అమ్ముకునే పరిస్థితి ఉండదని అన్నారు. ఈ విధానాల వల్ల ఆహార ధాన్యాల కొరత వస్తుందని అన్నారు.

# పడిపోతున్న పత్తి ధరలు

## సిసిఐ రంగంలోకి దిగినా దక్కని ఊరట

కర్నూలు,నవంబర్6(ఆర్ఎన్ఎ): పత్తి కొనుగోళ్లకు సీసీఐ రంగం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా పది కొనుగోలు కేంద్రాలలో నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తోంది. అయితే మార్కెట్‌లో పత్తి ధరలు పతనమయ్యా యని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే వ్యాపారులు రూ.800 నుంచి రూ.1500 వరకు తక్కువ ధర ఇస్తున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ సీసీఐని రంగంలోకి దించింది.

ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల మార్కెట్ యార్డు పరిధిలోని పత్తి జిన్నింగ్, ప్రెస్సింగ్ పరిశ్రమలను సీసీఐ గుర్తించింది. ఆదోనిలో 5, ఎమ్మిగనూరులో 2, నంద్యాలలో 3 పత్తి జిన్నింగ్ పరిశ్రమలు, కర్నూలు సమీపంలోని పెంచకలపాడు పత్తి జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మార్కెటింగ్ శాఖకు సంబంధం లేకుండానే నేరుగా సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి జిన్నింగ్ పరిశ్రమలో కొనుగోలు చేయనున్నారు. ప్రభుత్వం గత ఏడాది కంటే మద్దతు ధరను రూ.325 పెంచింది. 2019–20లో క్వింటం రూ.5,550 ఉండగా ఈ ఏడాది రూ.5,825 ఇస్తోంది. వర్షాలకు పంట దెబ్బతిన్నందున సీసీఐ ద్వారా ఊరట లభిస్తుందని రైతులు ఆశిస్తున్నారు. అయితే నాణ్యమైన పత్తిని మాత్రమే కొంటామని అధికారులు అంటున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది. రైతులు పత్తి అమ్మకాలకు పేర్లు నమోదు చేసుకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చే అవసరం లేదు. తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఆర్‌బీకేలలో వీఏఏల ద్వారా పేర్లను నమోదు చేసుకుంటే, సీఎం యాప్‌కు అనుసంధానం చేసిన సాఫ్ట్‌వేర్‌లో రైతు పేర్లు నమోదు అవుతాయి. ఆ తరువాత రైతుకు దగ్గరలో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రం వివరాలు రైతుల మొబైల్ ఫోన్‌కు చేరుతాయి. ఇందులో కొనుగోలు చేసే సమయం, కొనుగోలు కేంద్రం పేరు తదితర వివరాలు ఉంటాయి. ఆ సమయానికి రైతులు పత్తిని తీసుకువెళ్లి అమ్ముకోవచ్చు. బన్ని, బ్రహ్మ రకం పత్తిని క్వింటానికి రూ.5,825 సీసీఐ కొనుగోలు చేయనుంది. తేమ 8 నుంచి 12 శాతానికి మించరాదు. 12 శాతం మించితే కొనుగోలు చేయరు. రైతులు తెచ్చిన పత్తిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు ఆధారంగా కొనుగోలు చేస్తారు. డబ్బులను రైతు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. నీళ్లు చల్లిన పత్తి, గుడ్డిపత్తి, ముడుచుకుపోయిన పత్తిని కొనుగోలు చేయరు. రైతులు ఆరబెట్టుకొని నాణ్యతతో తీసుకొస్తేనే కొనుగోలు చేస్తామని సీసీఐ ప్రకటించింది.

# ఖమ్మం జిల్లాలో బస్సును ఢీకొన్న డిసిఎం

## –14మందికి తీవ్ర గాయాలు

ఖమ్మం,నవంబర్6(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కూసుమంచిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 14 మంది గాయపడ్డారు. శుక్రవారం ఉదయం కూసుమంచి మండలం పాలేరు జలాశయం వద్ద భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీకొన్నాయి. ఎదురురెదురుగా వెళ్తున్న ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో డీసీఎం క్యాబిన్ ధ్వంసమయ్యింది. దీంతో డీసీఎం డ్రైవర్ సహా బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదం వల్ల రోడ్డుకు ఇరువైపుల భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో రోడ్డుపై అడ్డంగా ఉన్న డీసీఎం, బస్సును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

# ఐటిడిఏ ద్వారా రవాణా వాహనాలు అందచేత

కుమ్రం భీమ్ ఆసిఫాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): : గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కృషి చేస్తుందని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కోనేరు కృష్ణారావు అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో సిర్పూర్.టి మండలం చింతకుంట, అచ్చవెల్లి గ్రామ లబ్దిదారులకు రెండు రవాణా వాహనాలు(మినీ వ్యాన్) ఒక్కో యూనిట్ 6లక్షల 35వేల 748 రూపాయల 40శాతం సబ్సిడీతో శుక్రవారం కాగజ్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐటీడీఏ అధికారులు ఎ.టి.డి.ఓ.నీలిమ. సిర్పూర్ బ్యాంకు మేనేజర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు ఐటీడీఏ సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

# ఖమ్మం వ్యాపారులకు కాపలాదారుగా ఉంటా

## –టిఆర్ఎస్‌లో చేరిన వ్యాపారులకు పువ్వాడ హామీ

ఖమ్మం,నవంబర్6(ఆర్ఎన్ఎ): వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముల్లుకర్రతో వారికి కాపాలదారుగా ఉంటానని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం నగర వెండి, బంగారం సంఘం అధ్యక్షుడు బందు సూర్యం, కార్యదర్శి నకిరికంటి సతీష్‌తో పాటు వెండి బంగారం శాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ నుండి 200 మంది వ్యాపారులు మంత్రి సమక్షంలో టిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి వర్తక వ్యాపారులకు అండగా వారి పక్షానే అనేక పనులు చేశామన్నారు. ముఖ్యంగా మిర్చి మార్కెట్ విషయంలో పూర్తి హామీ ఇచ్చామని, రైతుల, వ్యాపారుల అభ్యర్థన మేరకు ఇక్కడి నుంచి తలరించకుండా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి అనేక మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు. సీఎం కెసిఆర్ రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల పెన్నిధిగా నిలిచారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో బందు సూర్యం, నకిరికంటి సతీష్, బుర్లే లక్ష్మీనారాయణ, గడ్డం శ్రీనివాస రావు, రాయపూడి వెంకట్రామా రావు, ఆస.బుడిగెం రమేష్, వెగ్గళం విశ్వేశ్వరరావు, పేరం వీరభద్రం, గట్ల సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, కూరపాటి సుధాకర్, మహంకాళి వాసు, బుర్రి రవి కుమార్, సిరికొండ మాదవాచారి, గైక్వాడ్ బాలు, గడ్డం ప్రసాద్, ఆత్మకూరి వీరభద్రం, మిట్టపల్లి రాజు, కాట్కూర్ శ్రీకాంత్, కాట్కూర్ రాజేంద్ర, పెంటి సుందర్, ముసునూరి వెంకన్న, రామడగు రామక్రిష్ణ, మాసాబత్తిన ప్రభు, రుద్ర మధు, గడ్డం అరవింద్, ఉరిమెళ్ళ విజయ్ తదితరులు ఉన్నారు. మరోవైపు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 2.75 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 24వ డివిజన్లలో రూ.50 లక్షలతో వీడీవోస్ కాలనలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ కాల్వలను ప్రారంభించారు. 11వ డివిజన్ సాయి నగర్ నందు రూ.1.62కోట్లతో నిర్మించనున్న సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ పాపాలాల్, సుడా చైర్మన్ విజయ్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, కార్పొరేటర్ ప్రశాంతి లక్ష్మి, అధికారులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం నియామకం



రాజన్న సిరిసిల్లా, నవంబర్ 6 (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గాన్ని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఫౌండర్ అధ్యక్షులు డా.కత్తి జనార్ధన్ ,ఫౌండర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.పూర్ణ చందర్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా .కిరణ్ ,డా .అభిరామ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు . తెలంగాణ పబ్లిక్ డాక్టర్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా గౌరవఅధ్యక్షులుగా డా .మహేష్ రావు , అధ్యక్షునిగా డా.ఎం .మహేష్ , ఉపాధ్యక్షు లు గా డా .ధర్మ నాయక్, డా. శ్రీకర్ ప్రధాన కార్యదర్శిగా డా . మహమ్మద్ మసూద్ అహ్మద్ , కోశాధికారిగా డా .కపిల్ సాయి ,సంయుక్త కార్యదర్శిలుగా డా . సుభాషిని , డా .మీనాక్షి ,కార్య నిర్వహణ కార్యదర్శి గా మోహన కృష్ణ నియమితులయ్యారు .వీరికి పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్స్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపినారు



కోల్‌కతాలో దక్షిణెశ్వర్ కాళీ ఆలయాన్ని దర్శించుకున్న అమిత్ షా

# యాదాద్రిని దర్శించుకున్న సిఎంవో కార్యదర్శి

యాదాద్రి భువనగిరి, నవంబర్6 (ఆర్ఎన్ఎ): యాదాద్రి శ్రీలక్ష్మినరసింహా స్వామి వారిని సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేక స్వాగతం పలికి స్వామి వారి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆయన ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. తుది దశకు చేరుకున్న పనుల పురోగతిపై స్తపతి సలహాదారు ఆనందాచార్యుల వేలు, వైటీడీఏ ఇంచార్జీ ఎస్ఈ వసంత నాయక్, ఆర్కిటెక్ట్ ఆనంద సాయిలను అడిగితెలుసుకుంటున్నారు. ఆలయ మాడవీధుల, ప్రధాన ఆలయ, శివాలయం పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈవో గీత, ఉప స్తపతులు తదితరులు ఉన్నారు.

# అమెరికాలో ఓటు నమోదు అస్తవ్యస్తం

## రాష్ట్రాల అజమాయిషీలోనే ఎన్నికల నిర్వహణ

న్యూఢిల్లీ,నవంబర్6(ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌ను చూసి ఇప్పుడు అమెరికా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఇక్కడ ఇఎన్నికల ప్రక్రియతో పోలిస్తే అమెరికాలో గందరగోళ పరిస్థితులే ఎక్కువన్నారు. మనదేశంలోనే స్పష్టమైన ఎన్నికల విధానం ఉంది. అప్పుడప్పుడు అధికార పార్టీలు అజమాయిషీ చేస్తున్నా, స్వతంత్రంగానే ఇసి వ్యవహరిస్తుంది. అమెరికాలోని 'ఫెడరల్ ఎలక్షన్ కమిషన్' ఎన్నికలు నిర్వహించదు. ఎన్నికల ప్రచారాల్లో డబ్బు ప్రవాహాన్ని అడ్డుకుని, రాజకీయ పార్టీల నిధుల సేకరణ, ఖర్చులు వంటి అంశాలను మాత్రమే నియంత్రిస్తుంది. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలే అమెరికా అధ్యక్ష ఎన్నికలను నిర్వహిస్తాయి. దీంతో కొన్ని రాష్ట్రాల్లో తమ పార్టీకి అనుకూలంగా ఫలితాలు వచ్చేట్లు ప్రభుత్వ నేతలు అవకతవకలకు పాల్పడే అవకాశమూ లేకపోలేదు. భారత్‌లో ఎన్నికల సంఘమే పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి లొసుగులు లేకుండా, సరళంగా జరగాలి. అమెరికా ఎన్నికల ప్రక్రియ తీరు గందరగోళంగా ఉన్నట్లు కనపడుతోంది. ఫలితాలు రావడం ఆలస్యమవుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ప్రక్రియ విషయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అమెరికాలో తాజా ఫలితాలు చూసి ప్రపంచదేశాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. అమెరికాలో జాతీయ ఓటర్ల జాబితా అంటూ ఏదీ లేదు. ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకోవడం కోసం పౌరులు దరఖాస్తు చేసుకుంటే స్థానిక అధికారులే తమ ప్రాంతంలో ఓటర్ల జాబితాను రూపొందిస్తారు. ఈ ప్రక్రియలో కొందరు పౌరుల పట్ల గతంలో వివక్ష కొనసాగింది. ఓటర్ల నమోదు ప్రక్రియలు ఆయా రాష్ట్రాల నిబంధనలకు అనుగుణంగా ఉంటాయి. దీంతో సమస్యలు ఎదురవుతున్నాయి. భారత్‌లో ఓటర్ల లిస్టును ప్రభుత్వం కాకుండా ఎన్నికల సంఘం మాత్రమే రూపొందిస్తుంది. పోలింగ్ సమయం దాటితే ఓట్లు వేసేందుకు క్యూలో నిలబడేందుకు అనుమతి ఉండదు. అమెరికాలో అన్ని రాష్ట్రాల్లో ఏకరీతి బ్యాలెట్ విధానం కూడా లేదు. బ్యాలెట్ పేపర్లను పోస్టల్ ఓటింగ్ కోసం ఓటర్లు కొన్ని రోజుల ముందు తీసుకోవచ్చు. అవి చిరిగిపోవడం, చోరీకి గురికావడం వంటి ఇబ్బందులు ఉంటాయి. భారత్‌లో.. దేశం మొత్తం ఒకే విధానంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. 'ఎలక్షన్ డే' రోజు రోజు మాత్రమే ఓటర్లు ఓట్లు వేస్తారు. ఓటును ఎన్నికల సంఘం విధించిన గడువులోపే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అమెరికాలో 'ఎలక్షన్ డే' రోజు 'ప్రభుత్వ సెలవు దినం' కూడా ఉండదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారు. భారత్‌లో.. ఎన్నికల రోజున ప్రభుత్వ సెలవు దినం ఉంటుంది. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల్లో దాదాపు 15 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్ ముగిసేవరకు కొన్ని రోజులు పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

భారత్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో 61 కోట్ల మందికి పైగా ఓటర్లు ఓట్లు వేశారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన రోజున కొన్ని గంటల్లోనే అధిక శాతం సీట్లలో గెలుపెవరిదో తేలిపోయింది.

# పచ్చదనం కోసం ప్రజలు తోడ్పడాలి: పువ్వాడ

ఖమ్మం,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని ప్రతి పల్లె పకృతి వనం కావాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పల్ప్లలెల్లో పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేందుకు ప్రజల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. శుక్రవారం సత్తుపల్లి మండలం సిద్దారం పంచాయతీలో ప్లలె ప్రకృతి వనం,ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వీరయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన ప్లలె ప్రకృతి వనాలను సంరక్షించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే సిద్దారం పంచాయతీలో రూ.12.60 లక్షలతో నూతనంగా నిర్మించిన వైకుంఠ ధామం, రూ.2.50 లక్షలతో నిర్మించిన కంపోస్టు షెడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, మున్సిపల్ చైర్మన్ మహేష్ తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,నవంబర్6 (ఆర్ఎన్ఎ): రైతు సంక్షేమమే లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రాయపర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రైతులకు ప్రభుత్వ మద్దతు ధర దక్కాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు ఎర్రబెల్లి తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొలుగోలు చేస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అధికారులు అందజేసే కూపన్ల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ము కోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సంపత్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# దుబ్బాక ఫలితం తరవాత పిసిసి మార్పు

## కొత్త అధ్యక్షుడిని నియమించడం ఖాయం
## మధుయాష్కీ ఆసక్తికర వ్యాఖ్యలు

నిజామాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నాయకత్వ మార్పు అవసరం ఉందని ఏఐసీసీ కార్యదర్శి, నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కీ అన్నారు. ఎన్నికల్లో వరుస ఓటములు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పరిస్థితిపై హాట్ కామెంట్స్ చేశారు. దుబ్బాక ఫలితాల తర్వాత పీసీసీ మార్పుకు అవకాశం ఉండవచ్చని అంచనా వేశారు. దుబ్బాక ఫలితం ఎలా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ కొత్త ఉత్సాహంతో ముందుకు వెళ్తుందని అధిష్టానం ఆ దిశలో ఆలోచన చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మధుయాష్కీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉందన్నారు. నాయకులు ప్రజల్లోకి వెళ్లాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఫలితాలు ఎలా ఉన్నా ఏమీ ఆశించకుండా పని చేసుకుంటూ వెళ్లాలని ఆదేశించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కింది స్థాయి కార్యకర్త వరకూ అందరూ కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. పీసీసీ అధ్యక్ష పదవి విషయంలో రాష్ట్ర ఇన్ చార్జి మాణిక్యం ఠాగూర్, ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాస కృష్ణన్ తమ రిపోర్టులు జాతీయ పార్టీకి అందిస్తారని తెలిపారు. ఆ తరువాత అధిష్టానం పీసీసీ మార్పు నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో పార్టీ నాయకత్వంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. కాగా పీసీసీ చీఫ్ మార్పుపై మధుయాష్కీ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. గత కొంతకాలంగా ఉత్తమ్‌ను బాధ్యత నుంచి తప్పించి ఆయన స్థానంలో మరొకరిని నియమిస్తారని జోరుగా ప్రచారం సాగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మాజీ ఎంపీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

# దేవాదుల ఎత్తిపోతలతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

## లక్ష్యం చేరడానికి కావాల్సిన భూసేకరణ పూర్తి చేయాలి
## ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్,నవంబర్6(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాను దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సస్యశ్యామలం చేయడం మనముందు ఉన్న లక్ష్యమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ అన్నారు.దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా సస్యశ్యామలం చేయాలనేదే లక్ష్యమని అన్నారు. వరంగల్ హరిత కాకతీయ హోటల్‌లో మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఈ పథకంలో అనుకున్న లక్ష్యం చేరడానికి కావాల్సిన భూసేకరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చివరి ఎకరం వరకు నీరు అందే విధంగా ప్రణాళికలు రూపొందించి వెంటనే అమలు చేయాలన్నారు. ఈ విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా మేమంతా ప్రయత్నం చేస్తామన్నారు. మంత్రి శ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. దేవాదుల ఎత్తిపోతల పథకంలో దాదాపు 6 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే 4.5లక్షల ఎకరాల్లో నీరు వచ్చింది. మిగిలిన లక్షన్నర ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉంన్నారు. ములుగు జిల్లాకు సంబంధించి గోదావరి నది అక్కడి నుంచే వస్తున్నా.. వారికి ఆ నీరు రావడం లేదని అభిప్రాయం ఉంది. కావున లక్నవరం గొలుసు కట్టు చెరువులు, కుంటలకు నీరు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీలు బండ ప్రకాష్, పసునూరి దయాకర్, మాలోతు కవిత, పూర్వ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, జెడ్పీ చైర్మన్లు కుసుమ జగదీష్, సుధీర్, నీటి పారుదల శాఖ ఉన్నతధికారులు రజత్ కుమార్, మురళీ ధర్ రావు, ఆరు జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు ఉరితాళ్లు కానున్న వ్యవసాయ బిల్లులు: పొన్నం

వరంగల్ అర్బన్,నవంబర్6(ఆర్ఎన్ఎ): కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయ బిల్లులు రైతులకు ఉరితాళ్లుగా మారనున్నాయని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్పొరేట్ వ్యవసాయానికి పెద్దపీట వేసేందుకు మోదీ ప్రభుత్వం కొత్త బిల్లులు తెచ్చిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక వ్యవసాయ బిల్లులు తెచ్చి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిల్లులతో రైతులు కూలీలుగా మారే ప్రమాదం ఉందన్నారు. సన్నాలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రూ.2,500 మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# సచివాలయ నిర్మాణం పనులు షురూ

## మంత్రి వేములతో కలసి పరిశీలించిన సిఎస్
## అధికారులతో సమీక్షించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): నూతన సచివాలయ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కలిసి పరిశీలించారు. సమీకృత కొత్త సచివాలయానికి ఇప్పటికే ఔట్ లైన్ ముగ్గు పోసిన షాపూర్జీ పాల్లోంజీ నిర్మాణ సంస్థ పనులు ప్రారంభించింది. పనుల ప్రారంభ సూచకంగా తెలంగాణ ప్రవేశద్వారం సమీపంలో ఈ మధ్యే నిర్మించిన కమాన్ వెనక కన్‌స్ట్రక్షన్ సైట్ ఈశాన్య భాగంలో నిర్మాణ సంస్థ గొయ్యి తవ్వింది. 2019, జూన్ 26వ తేదీన వేద పండితులు నిర్ణయించిన శుభముహూర్తంలో సమీకృత కొత్త సచివాలయం పనులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

సచివాలయం నిర్మాణ పనులపై గురువారం ఎర్రమంజిల్ ఆర్అండ్‌బీ కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సంబంధిత అధికారులు, వర్క్ఏజెన్సీలతో సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం మేరకు సచివాలయం నిర్మాణ పనులు 12 నెలల్లో పూర్తి కావాలని సూచించారు.

ఇందుకోసం మొత్తం భవనాన్ని ఆరుప్రాజెక్టులుగా విభజించి ఒక్కోప్రాజెక్టుకు ఒక్కో వర్కింగ్ బృందం పర్యవేక్షించాలని చెప్పారు. ప్రాజెక్టుకు ఇద్దరు చొప్పున మొత్తం 12మంది జేఈలను, అదేవిధంగా ముగ్గురు డీఈలు, ఒక ఈఈ, ఒక ఎస్ఈతోపాటు ప్రత్యేకంగా మెకానికల్ పనుల కోసం.. ముగ్గురు జేఈలను, ఇద్దరు డీఈలను ఒక ఈఈని నియమించుకోవాలని సూచించారు. నిర్మాణ సంస్థ షాపూర్జీ నుంచి కూడా.. 12మంది ఫీల్డ్ ఇంజినీర్లు, ఆరుగురు ప్రాజెక్టు ఇంజినీర్లు ఒక ప్రాజెక్టు మేనేజర్‌ను నియమించాలని తెలిపారు. ఆర్కిటెక్ట్ వైపు నుంచి ఆరు సూపర్‌వైజింగ్ బృందాలు సైట్‌లో పనిచేసేలా చూడాలని చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖ తరఫున ఎస్ఈ, ఆర్కిటెక్ట్, షాపూర్జీ సంస్థకు చెందిన ముగ్గురు కలిసి, ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీగా ఏయే పనులు పూర్తిచేయాలో.. 11 నెలలు లక్ష్యంగా పీఈఆర్టీ చార్ట్‌ను వెంటనే సిద్ధం చేయాలని తెలిపారు. ప్రతివారం స్వయంగా పనులను పర్యవేక్షిస్తానని మంత్రి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచనలకను గుణంగా, తెలంగాణ ఖ్యాతిని చాటేలా సచివాలయ భవనం నిర్మాణం ఉండాలని వెల్లడించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ శశిధర్, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు, వాస్తు నిపుణుడు సుధాకర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధానికి బిజెపి నాయకుల యత్నం - అడ్డుకున్న పోలీసులు



రాజన్న సిరిసిల్లా, నవంబర్ 6 (నేటినిజం ప్రతినిధి):గంగుల శ్రీనివాస్ మృతికి తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పిలుపు మేరకు బిజెపి వేములవాడ పట్టణ శాఖ అధ్యక్షుడు,మున్సిపల్ కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆలయం ముందు భాగంలో రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు .దీనితో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది .

శ్రీనివాస్ కు నివాళులు అర్పించడం జరిగింది . ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్ మాట్లాడుతూ టీఆర్ఎస్ నిరంకుశ , నియంతృత్వ పాలనకు మనస్తాపం చెంది గత ఆదివారం నవంబర్ 1 న ఆత్మహత్యకు యత్నించిన గంగుల శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు . ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని చెప్పడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు . బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సంతి మహేష్ , బిజె? వై ఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మహంకాళి శ్రీనివాస్ గౌడ్ ,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గోపు బాలరాజు , కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోల కృష్ణ స్వామి ,బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రైతులు కొత్తగా సన్నాలు వేయడంలేదు: గంగుల

కరీంనగర్,నవంబర్6(ఆర్ఎన్ఎ): సన్నరకం ధాన్యంపై మంత్రి గంగుల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సన్నరకాలు వేయడం కొత్త కాదని.. గతంలోనూ పండించారన్నారు. రాజకీయం కోసమే కొన్ని చోట్ల పంటకు నిప్పు పెడుతున్నారన్నారు. రైతులు సన్నరకాలను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దన్నారు. కేంద్ర నిబంధనల కారణంగానే రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని పిలుపునిచ్చారు. సన్నరకాలకు రూ.1,888 చెల్లిస్తామన్నారు. అంతకు మించి ఇవ్వడం కుదరదన్నారు.

# ధరణిని అడ్డం పెట్టుకుని మోసం

## అమ్మిన భూమిని మరొకరికి విక్రయించే యత్నం
## మహిళపై చీటింగ్ కేసు నమోదు

నల్లగొండ,నవంబర్6(ఆర్ఎన్ఎ): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను ఓ మహిళ దుర్వినియోగపరిచింది. ఒక వ్యక్తికి అమ్మిన భూమిని రెండోసారి తన కూతురి పేర రిజిస్ట్రేషన్ చేయించుకుని రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులకు అడ్డంగా దొరికిపోయింది. బాధిత వ్యక్తి ఫిర్యాదు మేరకు మహిళపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో చోటు చేసుకుంది.జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ రంగనాథ్‌లు శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. తేరా విజయలక్ష్మి అనే మహిళకు పీఏ పల్లిలో 1.32 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. దీన్ని 2019 ఆగస్టు 14వ తేదీన కోట్ల జగదీశ్ అనే వ్యక్తికి విక్రయిస్తూ సేల్ డెడ్ చేసింది. అయితే జగదీశ్ ఈ భూమిని నాలా కన్వర్షన్ చేస్తూ ప్లాట్స్ గా చేసి విక్రయించారు. అయితే ఈ భూమిని జగదీశ్ కొనుగోలు చేశాక మ్యూటేషన్ చేయించలేదు. సేల్ డీడ్ తోనే నేరుగా నాలా కన్వర్షన్ చేసి ప్లాట్స్ గా అమ్మేశాడు. అయితే జగదీశ్ మ్యూటేషన్ చేయించుకోక పోవడంతో ఆ భూమి రెవెన్యూ రికార్డ్స్ లో విజయలక్ష్మి పేరుతోనే ఉన్నది. ధరణి పోర్టల్ లోనూ అలాగే నమోదైంది. దీన్ని ఆసరాగా చేసుకుని విజయలక్ష్మి అదే భూమిని రెండోసారి తన కూతురు ప్రియాంక పేరుతో ఈ నెల 4వ తేదీన గిఫ్ట్ డీడ్ చేసింది. విషయాన్ని గమనించి.. మొదట కొనుగోలు చేసిన జగదీశ్ రెవెన్యూ అధికారులకు, పోలీసులకు పిర్యాదు చేశారు. రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదును అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే రంగంలోకి దిగి విచారించగా వాస్తవాలు వెలుగు చూశాయి. ధరణి పోర్టల్ ను దుర్వినియోగం చేస్తూ తప్పుడు పద్దతిలో విజయలక్ష్మి మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసినట్లుగా గుర్తించారు. దీంతో విజయలక్ష్మిపై చీటింగ్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లుగా ఎస్పీ రంగనాథ్ వెల్లడించారు. ఇంకా

ఎక్కడైనా ఇలాంటి తప్పుడు పద్దతులు అవలభించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విక్రయించిన భూమి ఏదైనా కారణంగా మ్యూటేషన్ కాకుండా ధరణి పోర్టల్ లో వివరాలు ఉన్నంత మాత్రాన ఇంకొకరికి రిజిస్ట్రేషన్ చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని ఎస్పీ హెచ్చరించారు. ఏదైనా కొత్త విధానం ప్రవేశ పెట్టినప్పుడు ప్రారంభంలో కొన్ని సమస్యలు రావడం సహజమని, అంత మాత్రాన దాన్ని దుర్వినియోగం చేస్తామంటే చట్టం ఊరుకోదని ఎస్పీ స్పష్టం చేశారు.

# భూ సమస్యలను పరిష్కరించాలి

## షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమలాకర్

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 6 (నేటినిజం ప్రతినిధి):చందుర్తి మండలంలో



రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకల కమలాకర్ అన్నారు, చందుర్తి మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చందుర్తి మండలంలో ఎంతోమంది భూ సమస్యల కోసం ఇబ్బంది పడుతున్నారని, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు, గత ప్రభుత్వాలు దున్నేవాడిదే భూమి అని చెప్పారని, ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు కబ్జా చేసే వారికే పట్టాలు ఇస్తున్నారన్నారు, చందుర్తి మండలంలో జరిగిన భూమి అవకతవకలపై తాసిల్దార్ పై లోకాయుక్త లో కేసు వేయడం జరిగింది అన్నారు, అవినీతి అధికారులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమలాకర్ డిమాండ్ చేశారు, మండలంలో రైతుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు, గతంలో చట్టాలు వచ్చినవారందరికి పాస్బుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిసె ప్రభాకర్, ఉపాధ్యక్షులు హరీష్, బిజెపి మండల మాజీ అధ్యక్షులు సంపు నూరి పరశురాములు గౌడ్, నాయకులు లో కుర్తి సతీష్, పిట్టల దేవరాజు, వెంకటేష్, నేదూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు,

# అమరావతి భూములపై టీడీపీ నేతలకు 'సుప్రీం' నోటీసులు

## -విచారణ నాలుగు వారాల పాటు వాయిదా

న్యూఢిల్లీ,నవంబర్5(ఆర్ఎన్ఎ): అమరావతి భూ కుంభకోణంపై దాఖలైన పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు గురువారం తెలుగుదేశం పార్టీ నేతలకు నోటీసులు జారీ చేసింది. వారితో పాటు భూకుంభకోణం పై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్)కు కూడా నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

అమరావతి భూ కుంభకోణంపై దర్యాప్తును నిలువరిస్తూ హైకోర్టు ఇచ్చిన స్టేను ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. గురువారం ఉదయం విచారణ ప్రారంభం కాగానే సుప్రీం ధర్మాసనం పలు సునిశిత ప్రశ్నలు అడిగింది. ఏపీ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న దుష్యంత్ దవే గతంలో ఇచ్చిన తీర్పులను ఉదహరిస్తూ భూ కుంభకోణంపై స్టే ఇచ్చే అధికారం రాష్ట్ర హైకోర్టుకు లేదని నివేదించారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని, కేంద్ర దర్యాప్తు సంస్థలను కూడా ప్రతివాదులుగా చేర్చారా అని ధర్మాసనం ప్రశ్నించింది. కేంద్రం, ఈడీ ఇంప్లీడ్‌మెంట్ పిటిషన్లను తోసిపుచ్చినట్టు వెల్లడించారు. టీడీపీ ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలను ఈ ప్రభుత్వం సమీక్షిస్తుందా? అని ధర్మాసనం ప్రశ్నించగా.. అన్నీ కాదు, భారీస్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్న అంశాల్లో మాత్రమే విచారణ జరుపుతున్నామంటూ దుష్యంత్ దవే తెలిపారు. హైకోర్టుకు అసాధారణ అధికారాలు లేవని, సుప్రీం ఆదేశాలకు లోబడాల్సిందేనని వెల్లడించిన దవే.. తన వాదనను బలపర్చే పాత తీర్పులను ఉదహరించారు. రాష్ట్ర కేబినెట్ జూన్ నెలలో సిట్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుందని, మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగుతున్న తరుణంలో దర్యాప్తుపై స్టే ఇవ్వడం సరికాదని దుష్యంత్ దవే ధర్మాసనానికి నివేదించారు. సిట్ దర్యాప్తు విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోవడం కుదరదని, కొందరు ఆర్టికల్ 226 ప్రకారం హైకోర్టులో సిట్ దర్యాప్తుపై పిటిషన్లు వేశారని ఆయన వివరించారు. వ్యక్తిగతంగా ప్రభావితమైతే తప్ప ఆర్టికల్ 226 ప్రకారం రిట్ దాఖలు చేయలేరన్న విషయాన్ని దుష్యంత్ దవే ఉటంకించారు. పారదర్శకంగా సాగుతున్న సిట్ దర్యాప్తును టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకున్నారని దుష్యంత్ దవే అభియోగం మోపారు. దాంతో విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం.. కౌంటర్లు దాఖలు చేయాలంటూ ప్రత్యేక దర్యాప్తు బందానికి, తెలుగుదేశం పార్టీ నేతలకు నోటీసులు జారీ చేసింది

# ప్రభుత్వ వివరణ తెలియకుండా స్టే ఇవ్వలేం

## ఎల్ఆర్ఎస్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్,నవంబర్5(ఆర్ఎన్ఎ): ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని హైకోర్టులో దాఖలైన మూడు పిటిషన్లను కలిపి తెలంగాణ హైకోర్టు విచారించింది. పేద, మధ్యతరగతి వారు ఎల్ఆర్ఎస్ వలన ఇబ్బందులు పడుతున్నారన్న పిటీషనర్స్ హైకోర్టుకు వాదనలు వినిపించారు. ఎల్ఆర్ఎస్ పై స్టే విధించాలని హైకోర్టును పిటీషనర్స్ కోరినప్పటికి, ప్రభుత్వ వివరణ తెలియకుండా స్టే ఇవ్వలేమని హైకోర్టు పేర్కొంది. రాష్ట్రంలో అక్రమంగా లేఅవుట్లు లేకుండా చేయడం కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ను తీసుకొచ్చిందన్న ఏజీ. ఇల్లిగల్ ఎల్ఆర్ఎస్ రహితంగా రాష్ట్రంగా చేయాలనే ఉద్దేశ్యంతో ఎల్ఆర్ఎస్ ను తెలుకొచ్చామన్నారు

# ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాల వెల్లువ

## డాక్టర్ రెడ్డీస్ రూ. 5 కోట్ల విరాళం

హైదరాబాద్,నవంబర్6(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీ రూ. 5 కోట్ల విరాళం అందజేసింది. అక్టోబరు నెలలో హైదరాబాద్ నగరంలో ఊహించని భారీ వర్షాలతో సతమతమైంది.

గత వందేళ్లలో ఎన్నడూ లేనంతగా భారీ వానలు నగరాన్ని అతలాకుతలం చేశాయి. పలువురు మతిచెందగా, లోతట్టు ప్రాంతాల్లోని అనేక కుటుంబాలు నిరాశ్రయం చెందాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగానికి సంబంధించి వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఈ ఆపత్కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీ లిమిటెడ్ తన వంతు సహాయాన్ని అందిస్తున్నట్లు ఆ సంస్థ కార్పొరేట్ బిజినెస్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ వి. విశ్వనాథ్ తెలిపారు.

ఈ మేరకు రూ. 5 కోట్ల విలువైన చెక్కును మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. ఈ కష్ట కాలంలో మీ నాయకత్వం, సమయానుకూల సహాయక చర్యలపట్ల కతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

# కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి..



## -వైద్యాధికారి మసూద్

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 6 (నేటినిజం ప్రతినిధి): మహమ్మారి కరోనా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చందుర్తి ప్రభుత్వ వైద్యాధికారి మసూద్ అహ్మద్ అన్నారు, చందుర్తి మండలంలో శుక్రవారం రామన్నపేట తిమ్మాపూర్ గ్రామాల్లో కరోనా వైద్య శిబిరాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా 90 మందికి కొవిడ్-19 పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ రావడం జరిగిందన్నారు, ఇందులో రామన్నపేటలో ముగ్గురికి, తిమ్మాపూర్ లో ఇద్దరికీ, లింగం పేటకు చెందిన ఒకరికి పాజిటివ్ రావడం జరిగిందన్నారు, ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కరోనా రెండవ దశ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా మాస్కులు ధరించల న్నారు, ముఖ్యంగా చలి కాలం కరోనా సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, భౌతిక దూరం పాటిస్తూ, తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు, దగ్గు జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవల న్నారు,

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com